



లగేజీల తనిఖీ

అలర్ట్

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తం

కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

- అధికారులంతా తాము పనిచేస్తున్న కేంద్రాల్లోనే ఉండాలని ఆదేశం
- ఉద్యోగులకు సెలవులు బంద్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): **తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. శనివారం అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ ఈనెల 28వ తేదీ రాత్రి తీరం దాటుతుందని, అప్పటివరకూ అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఆస్తి, ప్రాణ, పశు నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.**

జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది అంతా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలన్నారు. ఉద్యోగులకు ఎటువంటి సెలవులు మంజూరుచేయరాదని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు వెనక్కి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సిద్ధంగా ఉండాలని, చెట్లు పడిపోతే తొలగింపునకు ఏర్పాట్లుచేయాలని, తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, జనరేటర్లు, డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను సిద్ధంగా చేసుకోవాలని సూచించారు.

తుఫాన్ వల్ల భారీవర్షాలు కురుస్తాయని, పెనుగాలులు వీచే అవకాశం ఉందని సముద్రం, నది ఒడ్డున, కొండవాలు ప్రాంతాలు, చెట్లు, సెల్, విద్యుత్ టవర్లు, హోర్డింగ్‌ల కింద ఎవరూ ఉండరాదని, పల్లపు ప్రాంతాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో 0891-2590102, 0891-2590100 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని, తుఫాన్ సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు.



చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులను హెచ్చరిస్తున్న ఫిషరీస్ జేడీ లక్ష్మణరావు

విద్యుత్ శాఖ అప్రమత్తం

- డివిజన్ల వారీగా కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడనున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. విశాఖపట్నం కేంద్రంగా పనిచేసే ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ శనివారం డైరెక్టర్లు, 11 జిల్లాల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, మన్యం జిల్లాల్లో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయాలు లేకుండా చూడాలని, అవసరమైన పరికరాలను, స్కిబందిని అందుబాటులో ఉంచుకోవాలని ఆయా సర్కిళ్ల ఎస్ఈలకు, డివిజన్ల ఈఈలకు సూచించారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు కార్పొరేట్ కార్యాలయం నుంచి సీజీఎం, జీఎం, ఈఈ, డీఈఈలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్తంభాలు, అదనపు సామగ్రిని ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తుఫాన్ సహాయక కేంద్రాలు, ఆస్పత్రులు, సెల్‌టవర్లను అత్యవసర సర్వీసులుగా భావించి కచ్చితంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదులు స్వీకరించి, తగిన చర్యలు చేపట్టేందుకు డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. పడిపోయే స్తంభాలు, తెగిపడే వైర్లు, చెట్లకొమ్మల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలు చెప్పవచ్చునని సీఎండీ తెలిపారు.

రవాణా శాఖ కొరడా

కొనసాగుతున్న ట్రావెల్స్ బస్సుల తనిఖీ

- పర్మిట్లు లేకుండా తిరుగుతున్న బస్సుల గుర్తింపు
- కొన్ని బస్సుల్లో అత్యవసర ద్వారం మూసేసి అక్కడ సీట్ల ఏర్పాటు
- 10 బస్సులపై కేసుల నమోదు
- ఆరు సీజ్
- గత 11 రోజుల్లో 56 బస్సులపై కేసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కర్నూలు జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. నిబంధనలు పాటించని వాహనాలపై కొరడా ఝులిపిస్తున్నారు. శుక్రవారం ఆరు బస్సులపై కేసులు నమోదుచేసిన అధికారులు శనివారం ఏకంగా పదింటిపై కేసులు నమోదుచేశారు. మరో ఆరు బస్సులను సీజ్ చేశారు.



ట్రావెల్స్ బస్సు లోపల ఆర్టీఏ అధికారుల తనిఖీలు

విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందినవారు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉంటున్నారు. వారంతా తరచూ స్వస్థలాలకు వచ్చి వెళుతుంటారు. రైళ్ల కంటే ఎక్కువగా ప్రైవేటు బస్సులనే ఆశ్రయిస్తుంటారు. దీంతో ట్రావెల్స్ బస్సులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. నగరం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రతిరోజూ సగటున 50 వరకు ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. పండుగ రోజుల్లో అయితే వందకుపైగా తిరుగుతాయి. అయితే ట్రావెల్స్ నిర్వాహకులు లాభాలను ఆర్జించాలనే ధ్యాసలో రవాణాశాఖ నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలను పాటించడం లేదు. బస్సులకు సకాలంలో పర్మిట్‌లు కట్టడం లేదు. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడం లేదు. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. బస్సుల రిజిస్ట్రేషన్ సమయంలో అధికారులకు సీట్లు ఒకలా చూపించి, ఆ తరువాత ఎక్కువమంది ప్రయాణికులు పట్టేలా మార్చేస్తున్నారు. బస్సుకు పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయాణికులు సురక్షితంగా సకాలంలో బయటకు వచ్చేందుకు వీలుగా ఏర్పాటుచేసిన అత్యవసర ద్వారాన్ని కూడా మూసేసి అక్కడ సీట్లను ఏర్పాటుచేస్తున్నారు. దీనివల్ల ప్రమాదం జరిగితే ప్రయాణికులు బయటపడేమార్గం ఉండడం లేదు. టూరిస్ట్ బస్సులుగా తిప్పేందుకు అనుమతులు తీసుకుని కొందరు స్టేజ్ క్యారియర్లుగా తిప్పుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక స్లీపర్ బస్సుల్లో ప్రయాణికులు నడిచేందుకు కేవలం ఒకటి, రెండు అడుగులు మాత్రమే ఖాళీ ఉంటుంది. విశాలమైన మార్గం లేకపోవడంతో ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు సకాలంలో బయటపడేందుకు వీలుండడం లేదు. పైగా రాష్ట్రంలో తిరుగుతున్న ట్రావెల్స్ బస్సులన్నీ ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో రిజిస్ట్రేషన్ జరిగినవే కావడంతో ఇక్కడి అధికారులకు బస్సుల్లో మార్పులు చేస్తే రిజిస్ట్రేషన్ జరగకుండా నిలుపుదల చేసేందుకు అవకాశం ఉండడం లేదు.



పర్మిట్ గడువు ముగియడంతో అధికారులు సీజ్ చేసిన బస్సు

వరుస ప్రమాదాల నేపథ్యంలో తనిఖీలు

గత నెల 15న రాజస్థాన్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఒకటి ... మిగతా 6వ పేజీలో

ఇకపై డీడీవోలు...

- డివిజన్‌కొక అభివృద్ధి అధికారి నియామకం
- ఉమ్మడి జిల్లాలో ఐదుచోట్ల ఒకటో తేదీ నుంచి కార్యాలయాలు ప్రారంభం
- డీడీవో పరిధిలోకి డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ, ఎంపీడీవోలు...
- సచివాలయాల పర్యవేక్షణ బాధ్యత అప్పగింత



భీమిలిలోని డీడీవో కార్యాలయం

విశాఖపట్నం/పాడేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా మరింత మెరుగైన పాలన/సేవలు అందించేందుకు డివిజన్ స్థాయిలో ఒక అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకూ కొనసాగుతున్న డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి పోస్టును డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో)గా మార్చింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి డీడీవో కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయి. డివిజనల్ పంచాయతీ అధికారి, డ్వామా ఏపీడీ, ఎంపీడీవోలు డీడీఓ పరిధిలోకి వస్తారు. ఇప్పటివరకూ వీరంతా ఎవరికి వారే సొంత కార్యాలయాల నుంచి పాలన నిర్వహిస్తున్నారు. డీడీవోలు జిల్లా కలెక్టర్‌కు జవాబుదారీగా ఉంటారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు తరువాత సచివాలయాల సిబ్బందిని ... మిగతా 6వ పేజీలో

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

జగదాంబ జంక్షన్ యల్లమ్మ ఆలయంలో పుట్ట వద్ద భక్తుల పూజలు




- కిక్కిరిసిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ రహదారి
- జూ మార్గంలో ట్రాఫిక్ జామ్

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని నగర ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జూ, విమ్స్, ఎన్‌హెచ్ఏఐ కార్యాలయాలు, విశాఖ వేలీ స్కూల్ రహదారి, కంబాలకొండల్లోని పుట్టల్లో ఎక్కువ మంది పాలు పోసి పూజలు చేశారు. అదే విధంగా ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మార్గంలోకి ఆ పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో వెళ్లారు. పుట్టలో పాలు వేయడానికి అంతా కుటుంబ సమేతంగా తరలి వెళ్లడంతో మద్దిలపాలెం జంక్షన్, జూరహదారి కిక్కిరిసి పోయాయి.

అప్పన్న భూములకు రెక్కలు

- అడవివరంలో సెంట్రల్ జైలు కోసం అప్పట్లో 100 ఎకరాలు తీసుకున్న ప్రభుత్వం
- అందుకు ప్రత్యామ్నాయంగా మధురవాడలో 106.47 ఎకరాల కేటాయింపు
- ఇప్పుడు అవి కూడా వెనక్కి...
- ఐటీ కంపెనీల కోసం తాజాగా అడవివరంలో మరో 150 ఎకరాలు తీసుకోవాలని నిర్ణయం
- ప్రత్యామ్నాయంగా గాజువాక, ములగాడ మండలాల్లో భూముల కేటాయింపు
- విలువ రూ.9,320 కోట్లు



సింహాచలం దేవస్థానం భూములు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం అవసరమైనప్పుడల్లా సింహాచలం దేవస్థానానికి చెందిన భూములను తీసుకుంటోంది. వాటికి ప్రత్యామ్నాయ భూముల కేటాయింపులో మాత్రం తీవ్ర తాత్సారం చేస్తోంది. అనేక ఏళ్లు గడిచాక ఎక్కడో ఒకచోట ఇచ్చి చేతులు దులుపుకొంటోంది. పదిహేనేళ్ల క్రితం సెంట్రల్ జైలు నిర్మాణం కోసం అడవివరంలో భూములు తీసుకొని, ప్రత్యామ్నాయంగా మధురవాడలో భూములు ఇచ్చింది. ఇప్పుడు మళ్లీ వాటిని వెనక్కి తీసుకుంది.

ఇటీవల ఐటీ కంపెనీలకు భూములు భారీగా అవసరం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సింహాచలం దేవస్థానం భూములపై దృష్టిపెట్టింది. అడవివరం సర్వే నంబరు 275లో 150 ఎకరాలను తీసుకుంది. అక్కడ ప్రస్తుతం మార్కెట్ విలువ చదరపు గజం రూ.17 వేలు లెక్కన చూపించి, ఆ భూముల విలువ రూ.1,234.20 కోట్లుగా పేర్కొంది. గతంలో అంటే 2006 కొత్త సెంట్రల్ జైలు నిర్మాణం కోసం అదే అడవివరంలో 100 ఎకరాలు తీసుకుంది. దానికి ప్రత్యామ్నాయంగా మధురవాడలోని సర్వే నంబర్లు 420, 424లలో 106.47 ఎకరాలు ఇచ్చింది. వాటిని కూడా ఇప్పుడు ఐటీ కంపెనీలకు ... మిగతా 6వ పేజీలో



బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఇంగ్లాండ్ క్రీడాకారిణి

నేడు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్

విశాఖపట్నం-స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. ఇంగ్లండ్ ఇప్పటివరకూ ఆరు మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో విజయం సాధించగా, ఒక మ్యాచ్‌లో ఓటమి పాలైంది. మరో మ్యాచ్ ఫలితం తేలలేదు. దీంతో తొమ్మిది పాయింట్లతో ఇప్పటికే సెమీఫైనల్స్‌కు ... మిగతా 6వ పేజీలో

ట్రాఫిక్ సమస్యకు చెక్

సిగ్నల్స్ నిర్వహణకు ఆర్ఎఫ్‌పీ

- 101 కూడళ్లలో ఏటీసీపీ కెమెరాలు
- 25 చోట్ల ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరాలు
- ప్రైవేటు ఏజెన్సీలకు ఐదేళ్లపాటు నిర్వహణ
- కలెక్టర్, సీపీ, జీవీఎంసీ కమిషనర్ భేటీలో నిర్ణయం



సాంకేతిక వ్యవస్థ ద్వారా సిగ్నల్ జంప్ అయిన వాహనం గుర్తింపు (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడంతోపాటు భవిష్యత్తులో పెరిగే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్, జీవీఎంసీ కమిషనర్‌లు, జిల్లా కలెక్టర్ సంయుక్తంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. రద్దీ మార్గాల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేలా సీసీ కెమెరాల నిఘా పెంచడంతోపాటు నేరస్తులు, పాత నేరగాళ్లు రోడ్లపైకి రాగానే వెంటనే సమాచారం పోలీసులకు చేరేలా ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఐదేళ్లపాటు నిర్వహణకు ఆసక్తి కలిగిన సంస్థల నుంచి ఆర్ఎఫ్‌పీలను జీవీఎంసీ ద్వారా పిలవాలని శుక్రవారం జరిగిన సమావేశంలో ముగ్గురు అధికారులు నిర్ణయించారు.

నగరంలో వాహనాల సంఖ్య పెరిగిపోతుండడంతో నిత్యం ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇలాంటి సమయంలో కొందరు వాహన చోదకులు సిగ్నల్స్ దగ్గర వేచి ఉండలేక జంపింగ్‌లకు పాల్పడడం, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడపడం చేస్తున్నారు. దానివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనచోదకులు ఎక్కువసేపు కూడళ్లలో ఆగకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్, ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారికి ఆటోమేటిక్‌గా ఈ-చలాన్ జారీ అయ్యేలా, నేరస్తులు రోడ్లపైకి వస్తే తక్షణం సమాచారం అందించేలా (ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరాలను ఏర్పాటుచేయడం ద్వారా) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థను ఏర్పాటుచేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి భావించారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో పలుమార్లు భేటీ అయి తన అంతరంగాన్ని వెల్లడించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జీవీఎంసీ కమిషనర్ కూడా సుముఖత వ్యక్తంచేయడంతో పైలట్ ప్రాజెక్టుగా దేశంలోని వివిధ పేరున్న సంస్థల ద్వారా నగర పరిధిలోని ఐదుచోట్ల ఏఐ ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరాలను ఏర్పాటుచేసి నెల రోజులపాటు ట్రయల్ రన్ నిర్వహించారు. వాటి ఫలితాలపై నెల కిందట ... మిగతా 6వ పేజీలో

గోస్తనీ నదిలో జారి పడి యువకుడి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలకుద్దులో నాగుల చవితి రోజున విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన చిల్ల శ్రీను (18) స్నేహితులతో కలిసి శనివారం ఉదయం గోస్తనీ నదిలో పూజా సామగ్రి కలిపేందుకు వెళ్లాడు. నది ఒడ్డున నిల్చుని సామగ్రి నదిలో కలుపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో గల్లంతయ్యాడు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఎవరూ దిగేందుకు సాహసించలేదు. విషయం గ్రామస్తులకు తెలియడంతో అంతా నది వద్దకు చేరుకున్నారు. పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కానీ ఎవరూ స్పందించకపోవడంతో స్థానికులే నదిలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో మృతదేహాన్ని వెతికితీసి ఒడ్డుకు చేర్చారు. కాగా శ్రీను భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు కావడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రయోజకుడై కుటుంబాన్ని ఆదుకుంటాడనుకుంటే విషాదం మిగిల్చాడని మృతుడి తండ్రి రమణ రోధించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. రమణ వ్యవసాయ కూలి కాగా, తల్లి ఇంటి వద్ద ఉంటుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భీమిలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిపూడి జలాశయం నుంచి 4257 క్యూసెక్కుల నీరు విడుదల

పద్మనాభం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :తాటిపూడి జలాశయంలో నీటిమట్టం పెరగడంతో గోస్తనీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయనగరం ఇరిగేషన్ శాఖ ఈఈ సూచించారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 297 అగుగులు కాగా ప్రస్తుతం 295.8 అడుగులు ఉందన్నారు. ఎగువ ప్రాంతంలో వర్షాల వల్ల జలాశయంలోకి 3675 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని చెప్పారు. స్పిల్‌వేలో ఒక గేట్ తెరచి 4257 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నామని, తుఫాను నేపథ్యంలో ఆదివారం రెండో గేటు కూడా తెరచి నీరు విడిచిపెడతామన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

... 5వ పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు సమీక్ష నిర్వహించారు. ఇలాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అందుబాటులోకి తేవాల్సిందేనని అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత సీసీ కెమెరాల ఏర్పాటు అంశం మరుగునపడిపోయింది. సీపీ శంఖబ్రతబాగ్చి శుక్రవారం కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో భేటీ అయి ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై చర్చించారు. ఐదేళ్లపాటు నిర్వహణకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు కలెక్టర్ సూచించారు.

101 కూడళ్లలో ఏటీసీఎస్ కెమెరాలు, 25 చోట్ల ఏఐ కెమెరాలు

ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు నేరాలకు అడ్డుకట్ట వేయడానికి నగరంలో 101 కూడళ్లలో అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ (ఏటీసీఎస్) కెమెరాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ కెమెరాలు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాలను గుర్తిస్తాయి. దాంతో వాహన యజమానులకు ఆటోమేటిక్‌గా ఈ-చలాన్‌ను జారీ అయిపోతాయి. హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, ట్రిపుల్ రైడింగ్, స్పీడ్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేసినా సీసీ కెమెరాలు గుర్తించి పోలీసుల ప్రమేయం లేకుండానే జరిమానా విధించేస్తాయి. అంతేకాకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రద్దీని బట్టి ఆటోమేటిక్‌గా సిగ్నల్స్ మారడం, ఒక కూడలి వద్ద గ్రీన్ లైట్ పడితే, అక్కడి నుంచి వాహనాలు తర్వాత కూడలికి వెళ్లేసరికి గ్రీన్‌సిగ్నల్ ఉండేలా సిగ్నల్ సింక్రనైజేషన్ చేస్తారు. దీనివల్ల ప్రస్తుతం ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు ఇతర విధులపై దృష్టిపెట్టేందుకు అవకాశం దొరుకుతుంది. నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో 25చోట్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిజేషన్ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల నగరంలో లేదంటే రాష్ట్రంలో ఎక్కడైనా నేరాలకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్నవారు, పాత కేసుల్లో నిందితులుగా ఉన్నవారు రోడ్డుపైకి వస్తే ఆయా కెమెరాలు వారి ముఖాన్ని గుర్తించి వారిపై ఉన్న కేసులు, వారెంట్‌లతో కూడిన సమాచారాన్ని పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు చేరవేస్తాయి. అక్కడి సిబ్బంది సమాచారం ఆధారంగా పోలీసులను అప్రమత్తం చేసి అదుపులోకి తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రముఖులు పర్యటించే మార్గాలైన జాతీయ రహదారి, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎన్ఏడీ జంక్షన్ నుంచి పెందుర్తి వరకు బీఆర్‌టీఎస్ రోడ్లను గ్రీన్‌కారిడార్‌గా గుర్తించాలని నిర్ణయించారు.

ఐదేళ్ల నిర్వహణకు ఆర్ఎఫ్‌పీ

నగరంలో ఏర్పాటుచేసే ఏటీసీఎస్ కెమెరాలతోపాటు ఏఐ కెమెరాలను ఏర్పాటుచేయడమే కాకుండా వాటిని ఐదేళ్లపాటు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) పిలవాలని అధికారులు నిర్ణయించారు. ఆర్ఎఫ్‌పీ పిలవడంతోపాటు అర్హత కలిగిన ఏజెన్సీని ఎంపికచేయడం, ఆ ఏజెన్సీకి ఐదేళ్లపాటు ఆర్థిక వనరులను సమకూర్చే బాధ్యతను కూడా జీవీఎంసీకే అప్పగించారు. దీనికి జీవీఎంసీ కమిషనర్ కూడా సుముఖత వ్యక్తంచేయడంతో ఆర్ఎఫ్‌పీని ఎలా పిలవాలనే దానిపై అధికారులు కసరత్తు ప్రారంభించారు.

అప్పన్న భూములకు రెక్కలు

... 5వ పేజీ తరువాయి

అవసరమని గత నెలలో వెనక్కి తీసుకుంది. అక్కడ చదరపు గజం రేటు రూ.44 వేలుగా ఉందని, వాటి విలువ రూ.2,267.38 కోట్లుగా చూపించింది. అడవివరంలో 150 ఎకరాలు, మధురవాడలో 106.47 ఎకరాలు మొత్తం 256.47 ఎకరాలు కాగా వాటి విలువ రూ.3,501.58 కోట్లుగా వెల్లడించింది.

ప్రత్యామ్నాయంగా మళ్లీ ఆ కొండల్లోనే

పంచగ్రామాల భూ సమస్య పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి తీవ్రంగా కృషిచేస్తున్న సంగతి తెలిసిందే. 2008 సర్వే లెక్కల ప్రకారం 12,149 మంది ఆక్రమించిన దేవస్థానం భూమి విస్తీర్ణం 420 ఎకరాలు. దానికి ప్రత్యామ్నాయంగా 547 ఎకరాలు ఇవ్వడానికి ప్రతిపాదిస్తే దానిని దేవస్థానం చైర్మన్ అశోక్‌గజపతిరాజు తొలుత వ్యతిరేకించారు. ఆ తరువాత గాజువాక, మల్కాపురం, గొల్లలపాలెం, పెదగంట్యాడల్లో మొత్తం 610.89 ఎకరాల కొండలను ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. వాటి విలువ రూ.5,231 కోట్లుగా న్యాయస్థానానికి తెలిపింది. అక్కడ ఆమోదం లభిస్తే వాటిని బదలాయిస్తారు. ఇప్పుడు తాజాగా ఐటీ కంపెనీల కోసం తీసుకున్న 256.47 ఎకరాలకు ప్రత్యామ్నాయంగా మళ్లీ అదే కొండల్లో అదే ప్రాంతాల్లో అంటే గాజువాక, ములగాడ మండలాల్లోని మల్కాపురం, గొల్లలపాలెం, ములగాడల్లోని అవే సర్వే నంబర్లలో 370.9 ఎకరాలు ఇవ్వడానికి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రతిపాదించారు. గాజువాకలో గజం రూ.32 వేలు, గొల్లలపాలెంలో రూ.22 వేలు, మల్కాపురంలో రూ.17 వేలు చొప్పున మార్కెట్ ధర నిర్ణయించారు.ఈ లెక్కన ప్రత్యామ్నాయంగా ఇచ్చే భూమి విలువ రూ.4,089.19 కోట్లు అని పేర్కొన్నారు. అంటే పాతవి, కొత్తవి కలిపి రూ.9,320 కోట్ల విలువైన భూములు దేవస్థానానికి ఇవ్వడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అయితే అవన్నీ కొండలని, పైగా పారిశ్రామిక ప్రాంతానికి దగ్గరగా ఉన్నాయని, నివాసాలకు ఉపయోగపడవని దేవస్థానం అధికారులు పెదవి విరుస్తున్నారు. కొన్నాళ్ల తరువాత ఆ భూములను కూడా వెనక్కి తీసుకున్నా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.


కైలాసగిరిపై పర్యాటకుల సందడి


సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న భీమిలి బీచ్ రోడ్డు

చల్లంగా చూడవయ్యా..నాగేంద్ర

నియోజకవర్గం వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలు

భీమునిపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ నాగుల చవితి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భీమునిపట్నంలో బీచ్‌రోడ్, కుమ్మరిపాలెం, దొరతోట రోడ్ భక్తులతో కిటకిటలాడాయి. 4వ వార్డులో చేపలుప్పాడ, జేవీ అగ్రహారం, మంగమారిపేట, కాపులుప్పాడ గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. నగరపాలెంలో ఒకే ఇంటి పేరుతో ఉన్నవారు ఒకే పుట్ట దగ్గరకు వెళ్లి పూజలు చేశారు. కాగా పట్టణీకరణ వల్ల ఎక్కడికక్కడ భవన నిర్మాణాలు చేపట్టడంతో పుట్టలు దొరక్క అవస్థలు పడ్డారు. తెల్లవారుజాము నుంచే పుట్టల కోసం వెతుకులాట ప్రారంభించారు. చాలామంది దూర ప్రాంతాలకు వెళ్లి పూజలు చేశారు.

నగరంపాలెంలో..

మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంత ప్రజలు నాగుల చవితిని భక్తి శ్రద్ధలతో జరి పారు. మిథిలాపురి వుడాకాలనీ,స్వతంత్ర నగర్, నగరంపాలెం, మల్లయ్యపాలెం, పోర్టు కాలనీ, వాంబే కాలనీలకు చెందిన వారు పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. కొందరు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పుట్టల్లోనూ, మరికొందరు జూ పార్కు, కంబాల కొండ నర్సరీ ప్రాంతాల్లోనూ పూజలు చేశారు. కాగా మధురవాడ, నగరంపాలెంలో తమ పూర్వీకుల ఆచారం ప్రకారం వాండ్రాసి కుటుంబ సభ్యులు ముందుగా గ్రామంలోని సింహాద్రి అప్పన్న దేవుడి ఇంటి వద్ద నామం బొట్లు పెట్టుకొని అనంతరం పుట్టలో పాలు పోశారు.

కిక్కిరిసిన కైలాసగిరి

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం తీరంతో పాటు కైలాసగిరి ప్రాంతంలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విశాలాక్షినగర్ బీచ్ రోడ్డులో ఉన్న ఫారెస్టు గెస్ట్ హౌస్ ఆవరణలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ సతీమణి సుజనా పూజలు నిర్వహించారు. అలానే నాగక్షేత్రంలో కూడా పూజలు జరిగాయి. కాగా పూజలు అనంతరం భక్తులు కైలాసగిరికి చేరుకున్నారు. కొండపై వాహనాలు నిండిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

ఎండాడ, సాగర్‌నగర్‌లో...

ఎండాడ, సాగర్‌నగర్ : ఎండాడ, గొల్లల ఎండాడ, న్యాయ కళాశాల రోడ్డు, గీతం ఆసుపత్రికి వెళ్లే మార్గం, టీటీడీ కొండ వెనుక భాగంతో పాటు పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా కనిపించాయి. సాగర్‌నగర్, రుషికొండ తీర ప్రాంతాల్లో కూడా వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలపై భక్తులు తరలివచ్చారు. బీచ్ రోడ్డు సందడిగా కనిపించింది.

కొమ్మాదిలో...

కొమ్మాది : మారికవలస, ఓజోన్ వేలి, కొమ్మాది శివారు గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతాల్లో భక్తులు పుట్టల్లో పాలు పోసి, పూజలు చేశారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను పుట్టల వద్దకు తీసుకువెళ్లి పూజలు చేయించారు.అలాగే పలు ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. మధురవాడ సిద్దేశ్వరస్వామి ఆలయంలో జంట నాగ బంధం, పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద షిరిడిసాయి ఆలయంలో కొలువై ఉన్న 108 నాగబంధాలకు, కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

పద్మనాభం, ఆనందపురంలో...

పద్మనాభం, ఆనందపురం : పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మద్ది గ్రామంలో ఎంపీపీ రాంబాబు, అయినాడలో భీమిలి ఏఎంసీ చైర్మన్ కె. రామస్వామినాయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టరు కె.లీలావతి పూజలు నిర్వహించారు. ఆనందపురంలో కూడా చవితి పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు.


సింహాచలంలో పుట్ట వద్ద భక్తుల పూజలు

సింహగిరి తోటల్లో...

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి కొలువైన సింహగిరి పరిసరాల్లోని తోటల్లో పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. 98వ వార్డులోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వేకువజాము నుంచే కుటుంబ సభ్యులతో కలిసి సింహగిరి ఘాట్‌రోడ్డు, అప్పన్నస్వామి పూదోట, వేంకటేశ్వరస్వామి దేవాలయ పరిసరాల్లో, ప్రియాగార్డెన్స్, విజినిగిరిపాలెం, సింహపురి కాలనీ ప్రాంతాల్లోని పుట్టల వద్దకు చేరుకుని నాగేంద్రునికి పూజలు చేశారు.

పద్మనాభం రూరల్ : అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం, బాందేవుపురం, రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెద ఎర్నినాయుడు, సర్పంచ్ జి, వెంకటలక్ష్మి, నాయకులు సిద్ధనాతి వెంకటరావు, వార్డు సభ్యులు రమణమ్మ, అప్పల సూర్యనారాయణ, తదితరలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సాగర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీ సేఫ్టీ, సెక్యూరిటీ విభాగం పర్యవేక్షణలో గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పే పద్ధతులను ప్రదర్శనల ద్వారా సిబ్బంది చేసి చూపించారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ సేఫ్టీ ఆఫీసర్ కేపీ చక్రధర్ మాట్లాడుతూ భద్రతా ప్రణాళికల్లో ఉన్న లోపాలను గుర్తించి, మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి మాక్ డ్రిల్‌లు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

భీమునిపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

తుఫాన్ పట్ల అప్రమత్తం

పద్మనాభం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ చలం సూచించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

శబరిమలైకు ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ ప్రత్యేక బస్సులు నడపనున్నది. 5, 6, 7 రోజుల యాత్రల పేరిట ఈ బస్సులను నడపనున్నారు. నవంబరు 16 నుంచి డిసెంబరు 27 వరకు ఆపరేట్ చేయనున్నారు. ఈ మేరకు శనివారం ద్వారకా కాంప్లెక్సులోని రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తన కార్యాలయంలో పోస్టరు ఆవిష్కరించారు.

5 రోజుల యాత్ర ప్యాకేజీ..

విశాఖ నుంచి బయలుదేరి విజయవాడ, మేల్ మరుతుర్, ఎరుమేలి, పంబ నుంచి సన్నిదానానికి చేరుకుంటుంది. స్వామి దర్శనానంతరం శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, విజయవాడ మీదుగా విశాఖ వస్తుంది. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ.6,600, ఇంద్ర ఏసీ బస్సుకు రూ.8,500గా ఆర్టీసీ నిర్ణయించారు.

6 రోజుల యాత్రకు..

విశాఖ నుంచి బయలుదేరి విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవానీ, పళని,ఎరుమేని, పంబ నుంచి స్వామివారి సన్నిదానానికి చేరుకుంటుంది. దర్శనమయ్యాక తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం తరువాత విశాఖ చేరుకుంటుంది. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ.7,000, ఇంద్ర ఏసీ బస్సుకు రూ.9,000ను వసూలు చేస్తారు.

7 రోజుల యాత్రకు..

విశాఖ నుంచి బయలుదేరి విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవానీ, పళని,ఎరుమేని, పంబలను దర్శించుకున్నాక సన్నిదానానికి చేరుకుంటుంది. అక్కడ స్వామి దర్శనమయ్యాక మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం ఆలయాల్లో దర్శించుకున్నాక విశాఖ చేరుకుంటుంది. ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ.7,600, ఇంద్ర ఏసీ బస్సుకు రూ.10,000 చొప్పున వసూలు చేయడం జరుగుతుంది. పూర్తి వివరాలకు 7382914219 సెల్ నంబర్‌ను సంప్రదించవలసిందిగా ఆర్ఎం కోరారు.

చెరువులా వెల్లంకి సర్వీసు రోడ్డు

కాలువలు మూసుకుపోవడంతో చేరిన నీరు


సర్వీసు రోడ్డులో చేరిన నీరు

ఆనందపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వెల్లంకి పంచాయతీలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డు శనివారం చెరువు నీటితో నిండిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన కాలువలు మూసుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సర్వీసు రోడ్డు ఎగువన ఉన్న చెరువులకు గండి పడడం, గెడ్డల ఆక్రమణ, సమీపంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు వాడుక నీరు విడిచిపెట్టడం తదితర కారణాల వల్ల ఆ నీరంతా కాలువల్లో ప్రవేశించకుండా రోడ్డుపై చేరింది. విషయాన్ని స్థానిక నాయకులు కాకర వెంకటరమణ, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, తదితరులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే, ఆయన తనయుడు రవితేజ ఆదేశాల మేరకు శనివారం ఉదయం జాతీయ రహదారుల విభాగం అధికారులు స్థానిక నాయకులతో కలిసి సర్వీసు రోడ్డును పరిశీలించారు. రోడ్డుపై నిలిచిపోయిన నీటిని జేసీబీ సహాయంతో గెడ్డ వైపు మళ్లించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, నేషనల్ హైవే అధికారులకు విషయాన్ని తెలిపి, త్వరలో సమావేశం ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పిన్నింటి వెంకటరమణ, కాకర సురేశ్, కుమార్, పెసల సాయి, తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ కొరడా

... 5వ పేజీ తరువాయి

దగ్ధమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేటు ట్రావెల్స్‌లో భద్రత, ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలు మేరకు బస్సులను తిప్పుతున్నారా?, లేదా?...అనేది తనిఖీ చేయాలని రవాణా శాఖ అధికారులను ఆశాఖ కమిషనర్ మనీష్‌కుమార్‌సిన్హా ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ తనిఖీ ప్రారంభించారు. తాజాగా కర్నూలు జిల్లాలో కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురవ్వడంతో మరింత ముమ్మరం చేశారు. గత 11 రోజుల్లో జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 56 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదుచేసి రూ.పది లక్షలు జరిమానా విధించారు. ఇవికాకుండా శుక్రవారం ఆరు, శనివారం 16 బస్సులపై కేసులు నమోదుచేశారు. శుక్రవారం కేసులు నమోదుచేసిన ఆరు బస్సుల్లో రెండింటికి పర్మిట్‌లు లేకపోవడంతో సీజ్ చేశారు. శనివారం మరో ఆరు బస్సులను సీజ్ చేశారు. శనివారం సీజ్‌చేసిన వాటిలో వర్షిణి, కావేరి, ఏఆర్ ట్రావెల్స్ శ్రీకృష్ణ ట్రావెల్స్ కేఆర్‌టీ ట్రావెల్స్‌కు చెందిన బస్సులు ఉన్నాయి. వీటిల్లో సీట్లను మార్చడం, అత్యవసర ద్వారం మూసేసి అక్కడ అదనంగా సీట్లను ఏర్పాటుచేయడం, పర్మిట్లు లేకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్టు డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు వివరించారు.

నేడు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్

... 5వ పేజీ తరువాయి

చేరింది. ఇక న్యూజిలాండ్ ఇప్పటివరకూ ఆరు మ్యాచ్‌లు ఆడి నాలుగు పాయింట్లు (ఒక గెలుపు, మూడు ఓటమి, ఫలితం తేలనివి రెండు) సాధించింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, భారత్‌లు ఇప్పటికే సెమీఫైనల్స్‌కు చేరాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఇక్కడ ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న చివరి లీగ్ మ్యాచ్ నామమాత్రమే. ఇదిలావుంటే మ్యాచ్‌పై తుఫాన్ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి.

గుంతలు పూడ్చివేత

పద్మనాభం,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :తునివలస నుంచి చిన్నాపురం జంక్షన్ వరకు ఉన్న రహదారిలో ఏర్పడిన గోతులను టీడీపీ నాయకులు శనివారం పూడ్చారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓళ్ల నందిని, తునివలస మాజీ సర్పంచ్ మూర్తి తమ సొంత నిధులు వెచ్చించి గుంతలు పూడ్చారు.

10న శ్రీవారి ఆలయంలో కార్తీక దీపోత్సవం

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీవారి ఆలయంలో నవంబరు 10న కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని దీపోత్సవం నిర్వహించనున్నారు. ధర్మ ప్రచార మండలి, స్థానిక వేంకట అన్నమాచార్య ట్రస్టు, ఇతర ధార్మిక సంస్థల సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు పోస్టర్లు ఆవిష్కరించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు చిట్టివలస బాలిక

తగరపువలస : చిట్టివలస ఉన్నత పాఠశాల విద్యార్థి జ్యోత్స్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం అచ్యుతాపురంలోని ఎం.జె.పురంలో జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చూపడంతో ఎంపిక చేశారు.

ప్రైవేటు బస్సులు తనిఖీ

కొమ్మాది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం స్టేడియం వద్ద ఆర్‌టీఓ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రైవేటు బస్సులను శనివారం తనిఖీ చేశారు. పత్రాలు సరిగ్గా లేని వాటిని మద్దిలపాలెం డిపోకు తరలించారు.

రుషికొండ బీచ్‌లో పాక దగ్ధం

సాగర్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో పర్యాటక శాఖకు చెందిన కుటీరం (పాక) శనివారం దగ్ధమైంది. నాగుల చవితి పురస్కరించుకుని సమీపంలో పుట్టల వద్ద కాల్చిన బాణసంచా పాకపై పడడంతో ఈ ప్రమాదం జరిగినట్టు ఆ శాఖాధికారులు భావిస్తున్నారు. బీచ్‌కు వచ్చిన సందర్శకులు గమనించి విషయాన్ని అగ్నిమాపక శాఖకు తెలియజేయడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటన వల్ల పర్యాటక శాఖకు సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లింది. కాగా పర్యాటక శాఖ గతంలో బీచ్‌లో రిసార్ట్స్ తరహాలో జమ్ముగడ్డితో మూడు కుటీరాలు ఏర్పాటు చేసింది. ఇవి నిర్మానుష్య ప్రాంతంలో ఉండడంతో వినియోగంలోకి తీసుకురాలేదు.


అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న నగేశ్‌కుమార్

ఘనంగా మాజీ ఎంపీపీ నగేశ్‌కుమార్ జన్మదిన వేడుకలు

పద్మనాభం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మద్ది గ్రామంలో మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్‌కుమార్ జన్మదిన వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వ హించి, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నగేశ్‌కుమార్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెద ఎర్నినాయుడు, మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, గ్రామ మాజీ సర్పంచ్ కాళ్ల సత్యవతి, బుగత శ్రీనివాసరావు (బుజ్జి), బుగత ప్రకాశ్, మొకర సన్నిబాబు, కాళ్ల రామారావు, సిద్ధనాతి వెంకటరావు, కె. సన్యాశినాయుడు, కాళ్ల శివ పాల్గొన్నారు.

వైభవంగా ప్రభుపాదుల తిరోభావ దినోత్సవం



ఆనందపురం, అక్టోబరు 25 (ఆంజ్యోతి) : గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో హరేకృష్ణ వ్యవస్థాపకుడు, భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు 48వ తిరోభావ దినోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రభుపాదుల విగ్రహానికి పండ్ల రసాలు, సప్త నదుల జలాలు, పలు రకాల పుష్పాలతో అభిషేకం జరిపారు.

ఇకపై డీడీవోలు...

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షించేందుకు డీఎల్‌డీవో పోస్టులు కొత్తగా ఏర్పాటు చేశారు. ఎంపీడీవోలలో సీనియర్లను తాత్కాలికంగా డీఎల్‌డీవోలుగా నియమించారు. వీరి కోసం ప్రత్యేకించి భవనాలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీరాజ్ శాఖను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేకదృష్టి సారించి ఎంపీడీవోలకు పదోన్నతులు ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమించారు. అయితే పదోన్నతులు ఇవ్వడంతో సరిపెట్టకుండా వారికి మరిన్ని అధికారాలు, బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. డీఎల్‌డీవో పోస్టును డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో)గా మార్చారు. పంచాయతీరాజ్‌లో గ్రామ పంచాయతీలను పర్యవేక్షించే డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారులు, గ్రామీణాభివృద్ధిలో ప్రధానంగా ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలించే డ్వామా ఏపీడీలు డీడీవోల పరిధిలోకి తీసుకువచ్చారు. ఇంకా మండల పరిషత్ అధికారులు (ఎంపీడీవోలు) కూడా డీడీవో పర్యవేక్షణలో పనిచేయాలని ప్రభుత్వం జాబ్ చార్ట్ రూపొందించింది. డివిజన్ పరిధిలో సచివాలయాలు మొత్తం డీడీవో పర్యవేక్షణలో పనిచేస్తాయి. సచివాలయాల సిబ్బంది సర్వీస్ వ్యవహారాలు కూడా డీడీవోనే చూస్తారు. పంచాయతీరాజ్ శాఖలో ఇంజనీరింగ్ పనులపై డీడీవోకు సమీక్షించే అధికారం ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖపట్నం, భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు కేంద్రంగా డీడీవో కార్యాలయాలు నవంబరు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ప్రస్తుతం ఉన్న డీఎల్‌డీవో కార్యాలయాలనే డీడీవో కార్యాలయాలుగా మార్పు చేశామన్నారు. కమిషనర్ ఆదేశాలతో కార్యాలయాల ఆధునికీకరణ, ఫర్నీచర్, పెయింటింగ్ పనుల నిమిత్తం ఒక్కొక్క కార్యాలయానికి రూ.15 లక్షలు వెచ్చించామన్నారు.









జగదాంబ జంక్షన్‌లోని ఎల్లమ్మతోట ఆలయంలో గల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, ఆలయం వద్ద క్యూలో బారులుతీరిన భక్తులు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులో గల పుట్ట వద్ద భక్తుల పూజలు... పక్కన జనసంద్రంగా మారిన రహదారి

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

- జనంతో కిటకిటలాడిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ రోడ్డు
- మద్దిలపాలెం కూడలిలో స్తంభించిన ట్రాఫిక్
- ఎల్లమ్మతోట ఆలయానికి పోటెత్తిన భక్తులు


జూ పార్కులో పూజల అనంతరం సేదతీరుతున్న జనం

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను శనివారం నగరవాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా పుట్టకు వెళ్లి నాగేంద్రుడిని పూజించారు. నగరంలోని పోర్టు క్వార్టర్స్, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి రైల్వే క్వార్టర్స్, కైలాసపురం, సీతమ్మధార, ఆరిలోవ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఎల్లమ్మతోట ఆలయం, జూ, కైలాసగిరి, ఎన్ఏడీ, పెందుర్తి, గాజువాక, గోపాలపట్నం, తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పూజలు చేశారు. పుట్టలో పాలు, గుడ్లు, తదితర ప్రసాదాలను వేశారు. పుట్టమన్నును కొద్దిగా తీసి చెవులకు అద్దుకున్నారు. అలా చేయడం వల్ల చెవిపోటు రాదన్నది భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం పుట్టల సమీపంలో పలువురు భక్తులు బాణసంచా కాల్చారు. కాగా జగదాంబ జంక్షన్‌కు సమీపంలోని ఎల్లమ్మతోటలో గల పుట్టలో పాలు పోసేందుకు భక్తులు బారులుతీరారు. అదేవిధంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులో గల పుట్టల వద్ద పూజలు జరిపేందుకు వచ్చిన భక్తులతో ఈ ప్రాంతం కిటకిటలాడింది. ఈ క్రమంలో మద్దిలపాలెం కూడలిలో చాలాసేపు ట్రాఫిక్ స్తంభించింది.


నాగులచవితి పూజలకు వచ్చిన భక్తులతో కళకళలాడుతున్న కైలాసగిరి



పాలు పోసి.. పుట్టకు ప్రణమిల్లి

- ఘనంగా నాగులచవితి పూజలు
- ఏయూ క్యాంపస్, జూ పార్కు, కంబాలకొండ, ముడసర్లోవ, ఆరిలోవలో కోలాహలం

ఆరిలోవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పర్వదినం పురస్కరించుకొని ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పుట్టల వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముడసర్లోవ పార్కునకు సుమారు నాలుగు వేల మంది భక్తులువచ్చి పూజలు చేశారు. పార్కు అంతా సందర్శకులతో నిండిపోయింది. జీవీ ఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత దంపతులు కుటుంబ సమేతంగా వచ్చి నాగదేవతకు పూజలు చేశారు. అలాగే కంబాల కొండ పార్కునకు అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. ఇక్కడ బాణసంచాను పార్కు లోకి అనుమతించ లేదు. సుమారు 4,500 మంది పార్కును సందర్శించగా, వారి నుంచి టికెట్ల రూపేణా రూ.2.67 లక్షల ఆదాయం సమకూరినట్టు పార్కు రేంజర్ ప్రబల శాస్త్రి తెలిపారు. ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలకు కూడా భక్తులు అధిక సంఖ్యలో క్యూ కట్టారు. ఇక్కడ సహజసిద్ధంగా పుట్టలు ఉండడంతో పూజలు చేసేందుకు ప్రతి ఏటా ఎక్కువ మంది భక్తులు విచ్చేస్తుంటారు. ఉదయం ఏడు గంటల నుంచి జూ పార్కును తెరిచారు. జూలోని వివిధ పుట్టల వద్ద పూజలు చేసిన భక్తులు అనంతరం చెట్ల నీడలో కుటుంబాలతో కూర్చొని ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరారు. జంతువుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ కూడా బాణసంచాను అనుమతించలేదు. పిల్లాపాపలు సెల్ఫీలు, ఫోటోలు తీసుకొంటూ ఆనందంగా గడిపారు. టికెట్ల రూపేణా సుమారు రూ.7.6 లక్షల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

కంబాల కొండ, జూ పార్కు వద్ద భక్తుల రద్దీ నెలకొనడంతో వాహనాలు పార్కింగ్ ప్రాంతాలు నిండిపోతాయి. అలాగే విశాఖ వేలి స్కూలు నుంచి బీచ్‌కు వెళ్లే రోడ్డులో కూడా వాహనాల పార్కింగ్‌తో నిండిపోయింది.


ఎంవీపీ కాలనీ : పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ ఏపీ టూరిజం అతిథిగృహం సమీపంలో ఉన్న యల్లమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న ఈ పుట్ట వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు నాగుల చవితి పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తుల పుట్ట వద్దకు క్యూ కట్టారు. అలాగే ఇతర ప్రాంతాల్లోని పుట్టల వద్ద కూడా పూజలు చేపట్టారు. దీంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. పుట్టల వద్దకు కుటుంబాలతో చేరుకున్న భక్తులు పూజల అనంతరం ఫొటోలు, సెల్ఫీలు తీసుకొంటూ ఆనందంగా గడిపారు.


వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కు బయట ఉన్న స్టీల్‌ప్లాంటు క్వార్టర్స్ స్థలాల వద్ద, కొండలపైన ఉన్న పుట్టల వద్దకు భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి నాగులచవితి పూజలు నిర్వహించారు. చిన్నారులు మతాబులను కాల్చారు. అన్ని ప్రాంతాలు సందడిగా కనిపించాయి.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు


అభిని అభినందిస్తున్న గురుకులం అధ్యాపకులు

ఆరిలోవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఏలూరులో జిల్లా పెదవేగి గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-19 అథ్లెటిక్ పోటీల్లో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ చదువుచున్న ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. వీరిలో చింతకాయలఅభి, దీక్షత్, దుర్గా ప్రసాద్, విజ్ఞాన్, పూర్ణ చంద్, నాగచైతన్య ఉన్నట్టు తెలిపారు. వీరిలో అభి డిస్క్‌త్రో, షాట్ పుట్ త్రోబాల్‌లో అత్యంత ప్రతిభా పాటవాలు కనబరిచి రెండు రజత పతకాలను సాధించినట్టు పీడీ విద్యాసాగర్, పీఈటి వివేక్ తెలిపారు వీరంతా నవంబరు 26 నుంచి 30 వరకూ హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని వారు చెప్పారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.







సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 34, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 66, దొండకాయలు 42, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 78, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

చంద్రబాబు సీఎంగా ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టం

- నగరంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై బీసీ జిల్లా సంఘం హర్షం

వెంకోజీపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) :లక్ష మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటోందని విశాఖ జిల్లా బీసీ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు మండెం సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. శనివారం ఏయూలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ దేశంలోనే గొప్ప పాలనానుభవం కలిగిన చంద్రబాబు వంటి నాయకుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. విశాఖ నగరంలో గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలను తేవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో విశాఖ యాదవ సంఘం ఉపాధ్యక్షులు పల్లా రమేష్‌యాదవ్, మత్స్యకార సంఘం నాయకుడు పొట్టి పోలిరాజు, అరిసిల్లి అప్పారు, ఏయూ ఎంప్లాయిస్ నాయకుడు కోన పోలారావు, నగరాలు కుల సంఘ నాయకుడు బంగారి ఎస్.రవి, నాగవంశం కుల సంఘ నాయకులు మద్దుగారి ప్రసాద్, తూర్పు కాపు నాయకుడు కోలా కార్తీక్, గుడివాడ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఫెడరేషన్ సభ్యులు

నేడు వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి రాక

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ మూడు రోజుల పర్యటనకు ఆదివారం నగరానికి వస్తున్నారు. ఆదివారం రాత్రి నగరానికి చేరుకుని హోటల్ గ్రాండ్‌బేలో బస చేస్తారు. ఈ నెల 27న ఉదయం ఏఎంసీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం విమ్స్‌లో డ్రగ్ కంట్రోల్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం బీజేపీ కార్యాలయానికి వెళతారు. 28వ తేదీన ఆయన విజయవాడకు బయలుదేరి వెళతారని అధికారులు తెలిపారు.

సముద్రంలో మత్స్యకారుడి గల్లంతు


ఎల్లాజీ (ఫైల్‌ఫొటో)

పెదవాల్తేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటకు చెందిన సంప్రదాయ మత్స్యకారుడు రామోలు ఎల్లాజీ (28) సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. అతడు శుక్రవారం ఉదయం సుమారు నాలుగు గంటల సమయంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వ అధికారులకు వేడుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి.

ఎల్లాజీ శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు ఒక్కడే ఫైబర్ బోటు మీద సూరలు (ట్యూనా) చేపల వేటకు వెళ్లాడు. తీరం నుంచి సుమారు 30 నాటికల్ మైల్ దూరం వెళ్లినట్లు మత్స్యకారులు తెలిపారు. తిరిగి వచ్చే సమయంలో వాతావరణం అనుకూలిక గమ్యాన్ని గుర్తించే పరికరాలు (జీపీఎస్) లాంటివి లేనందున ఒడ్డుకు రాలేకపోయి ఉండవచ్చని అంటున్నారు. ఎల్లాజీని ఆచూకీ కనుగొనేందుకు శనివారం ఉదయం పెదజాలారిపేట తీరం నుంచి ఎనిమిది బోట్లలో తోటి మత్స్యకారులు వెళ్లారు. అయినప్పటికీ ఎల్లాజీ అచూకీ లభ్యం కాలేదని మత్స్యకార గ్రామ పెద్దలు తెలిపారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణ్ రావు తీరం ప్రాంతానికి వచ్చి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్లాజీ గల్లంతు విషయం ఎంవీపీకాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పెదజాలారిపేట గ్రామస్థులు తెలిపారు.

చైన్‌స్నాచింగ్

పద్మనాభం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పుస్తెలతాడు చోరీపై పద్మనాభం పోలీసులు కేసు నమోదు చేశారు. కుర్రపల్లికు చెందిన బంక దుర్గ తన భర్త సూరిబాబుతో కలిసి శని వారం రేవిడి పీహెచ్‌సీకి వెళ్లింది. వైద్య పరీక్షల అనంతరం ఇంటికి నడిచి వెళ్తుండగా బంకవారి కళ్లాలకు వచ్చేసరికి బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న 2.25 తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకొని పరారయ్యాడు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేసింది.

కార్తీక దీపోత్సవం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీఅధ్యక్షుడు వెంకట పట్టాభిరామ్‌తదితరులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో నవంబరు 10న నిర్వహించనున్న కార్తీక దీపోత్సవం పోస్టర్‌ను ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే వెలపూడి రామకృష్ణబాబు శనివారం ఆవిష్కరించారు. ఆ రోజు సాయంత్రం టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు చోడె వెంకట పట్టాభిరామ్ కరపత్రాలను ఆవిష్కరించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) ఒడిశాలోని కోరాపుట్‌కు చెందిన యువతి అదృశ్యమైనట్టు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా తెలిపిన వివరాలా ఉన్నాయి.

హెచ్‌బీ కాలనీ పీలా హోమ్స్ అపార్టుమెంటులో ఉంటున్న ఊర్మిళ తురుక్ ఇంటికి ఒడిశాకు చెందిన తన తమ్ముడు ప్రమోద్ కుమార్, అతడి కుమార్తె ప్రతిభా ప్రదిక(19) దసరా సెలవులకు వచ్చారు. కుమార్తె ప్రతిభా ప్రదికను తన సోదరి ఇంటి వద్ద ఉంచి, ప్రమోద్‌కుమార్ సంబల్‌పూర్ వెళ్లాడు. ఈ నెల 24న ఇంటి యజమాని ఊర్మిళ తురుక్ కోరాపుట్ వెళుతుండగా, వాచ్‌మన్ ఫోన్ చేసి, ఆమె ఇంటిలో ఉంటున్న యువతి అయిదో అంతస్తు నుంచి బాత్రూమ్ పైపులను ఉపయోగించి కిందికి దిగిందని, తర్వాత ఓ యువకుడితో కలిసి వెళ్లిపోయిందని చెప్పాడు. దీంతో ఊర్మిళ తిరిగి వచ్చి ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కోరాపుట్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తమ ఇంటిలో రూ.22 వేలు, 14 గ్రాముల బంగారం కూడా కనిపించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (SUDA), శ్రీకాకుళం
Ref No.IFB No.10/2025-26, dt:24.10.2025

SUDA వారు చేపడుతున్న పనులకు "తృతీయ పక్ష నాణ్యత నియంత్రణ (TQPC) సేవలు" అందించుటకు అర్హత కలిగిన ఏజెన్సీలు/ కన్సల్టెంట్ల నుండి "ప్రతిపాదనలు (RFPs)" ఆహ్వానించబడుతున్నాయి. RFP పత్రాలు SUDA వెబ్‌సైట్ www.eprocurement.gov.in నుండి పొందవచ్చు. చివరితేదీ: 13.11.2025 Upto 5.00PM వివరాలకు వైస్ చైర్మన్, SUDA శ్రీకాకుళం

సం/- వైస్ చైర్మన్, SUDA

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, డి.నెం.14-1-1/2బి, 2వ ఫ్లోర్, మోర్ ఎదురుగా, మహారాణిపేట, విశాఖపట్నం - 530002

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్)** (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" అని పిలువబడేది, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనం చేయబడినది మరియు తేది.09.11.2022 నాటి NCLT Bench-II చెన్నై ఆదేశాల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తరువాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్చడానికి ఆమోదం పొందినది (కార్పొరేట్ అర్థిక మంత్రిత్వ శాఖ తేది.30.11.2022 నాటి లేఖ ప్రకారం) కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టర్ చేయబడిన కంపెనీ మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపారం చేయడానికి ఆర్‌బిఐలో కూడా రిజిష్టర్ చేయబడినది, దాని రిజిష్టర్డ్ కార్యాలయం శ్రీ టవర్స్, ఫ్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై - 600032 వద్ద ఉంది) యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా దిగువ పట్టికలోని వివరాలుగల ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.

ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని **తేది.23.10.2025**న స్వాధీన పరచుకున్నారు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి
1. మొల్లి కనక సంతోష్ కుమార్, తండ్రి : ఎమ్. సూర్యనారాయణ, ఇ.నెం.13-16-36/2, సంజీవ గిరి కాలనీ, బిసి రోడ్డు, గాజువాక, విశాఖపట్నం - 530026. **2. దొక్కుల రామ సీత,** భర్త : డి. శ్రీనివాసరావు, తండ్రి : ఎమ్. పోలిరాజు, ఇ.నెం. 4-133/1, కాపు వీధి-1, పెద్దబొడ్డేపల్లి, నర్సీపట్నం, విశాఖపట్నం - 531116. **3. మొల్లి వరాహ రామ్ కుమార్,** తండ్రి : సూర్యనారాయణ, ఇ.నెం. 13-16-36, సంజీవ గిరి కాలనీ, బిసి రోడ్డు, గాజువాక, విశాఖపట్నం - 530026.	ఋణ ఖాతా నెం. GJWKATF2209300003 యొక్క రిఫరెన్సు క్రింద రూ.43,43,723/- (అక్షరాల నలభై మూడు లక్షల నలభై మూడు వేల ఏడు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) చెల్లించవలసి యున్నది **డిమాండ్ నోటీసు తేది : 09-06-2025**

నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ నెం.7468/2022 ప్రకారం దొక్కుల రామ సీత గారి స్థిర తనఖా ఆస్తి వివరములు: అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం సబ్ డిస్ట్రిక్ట్, నర్సీపట్నం మండలం, నర్సీపట్నం మున్సిపాలిటీ ఏరియా, పెద్దబొడ్డేపల్లి గ్రామ ఖాతాలో, సర్వే నెం. 45/1, 8వ వార్డు, 8వ బ్లాకు, శ్రీనగర్ కాలనీ నుండి చోడవరం పోవు రోడ్డుకు పడమర వైపున 108 చ॥గ॥లు లేదా 90.28 చ॥మీ॥ల విస్తీర్ణంలో క్రింది అంతస్తు నందు 550 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, మొదటి అంతస్తు నందు 550 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు బాత్ రూమ్స్ నందు 55 చ॥అ॥ల ప్లింత్ ఏరియాతో, డి.నెం.8-8-489తో గల ఆర్‌సిసి భవనం యావత్తు ఆస్తి. **కొలతలు మరియు హద్దులు: తూర్పు** : తుమ్మిడి అనంత లక్ష్మీ సత్యవతి గారి స్థలం - 35.60 అ॥లు లేదా 10.85 మీ॥లు, **దక్షిణం** : పెట్ల సింహాచలం గారి స్థలం - 25.00 అ॥లు లేదా 7.625 మీ॥లు, **పడమర** : తుమ్మిడి అనంత లక్ష్మీ సత్యవతి గారి ఇల్లు - 40.60 అ॥లు లేదా 12.38 మీ॥లు, **ఉత్తరం** : రోడ్డు - 26.00 అ॥లు లేదా 7.93 మీ॥లు.,

సాధారణ ప్రజానీకమంతటికి కూడా ఈ నోటీసు ద్వారా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై **ఎస్ఎఫ్ఎల్** యొక్క అధీకృత అధికారి చట్టపరమైన స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీసు అందిన తర్వాత ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి **ఎస్ఎఫ్ఎల్** యొక్క ముందస్తు లిఖితపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగా బదిలీ చేయరాదు లావాదేవి జరుపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : విశాఖపట్నం, తేది : 23-10-2025 | **అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

CLASSIFIEDS

FLAT FOR SALE

★ 2B/R, 1150Sft, 90Sft, Car Parking, 4th Floor, E/F, Sri Sai Srinivasa Sadan, TPT Colony, S.dhara, Vizag. 5Yrs Old., No Agents. Ph: 73864 59064. AJV_251761

★ 3BHK, 6yrs old E/F 1350sft with complete wood work, grills 100ft road, 2bhk, 1060sft with Modular Kitchen, Grills, 2y Old, Sujathanagar. Ph: 7997274447, 8639168165. AJV_251765

★ Dwarakanagar - 2 BHK Premium Flats, N Facing, No GST, Ready to occupy, Near B.V.K. College, Dwarakanagar, VSP. Ph: 9542794669, 9492458777. AJV_251758

» 2BHK 1000sft & 3BHK 1260sft, Near Police Station to Pendurthi Centre, Zudio, Style Union Backside, Brundavan Garden, VSKP.. Ph : 8886216096, 9393108858 AJV_14535

» 3 BHK flat 1420 sqft + 120 sqft two car parkings, full wood work modular kitchen safety grills etc for URGENT sale just behind SHEELA NAGAR Call : 8125588588. AJV_251766

★ East Facing 1000sft 2BHK Near By Park, Tempany School, Main Road, Side Flats, VUDA Colony, Ready to Occupy. Gajuwaka. Ph: 9603626627. AJV_251763

» Sivajipalem Premium Flat Sale, 2BHK, 920Sft, North Facing. Opposite Sivaji Park Road. Contact: 9866122731, 9000922731. AJV_7938

WANTED

» విజయవాడ, మొగలరాజపురం నందు ఇంటి దగ్గర ఉండి Supervisor గా పనిచేయుటకు మాస్టర్ డిగ్రీ చదువుకుని మరియు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలు తెలిసి వున్న ఆడ మనిషి కావలెను మరియు ఆసక్తికరమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 63093 60969, 83417 15255. AJB-235779

OLD AGE HOME

» శ్రీవైష్ణవి రిటైర్మెంట్ హోమ్స్ హాస్పటల్, ఓల్డ్ ఏజ్ హోమ్స్, హోమ్ నర్సింగ్ సర్వీసెస్, బెడ్‌రిడ్, ఫిజియోథెరపి, A/C, Non A/C రూమ్స్ @ MVP / సీతమ్మధార, / విశాలాక్షినగర్ / పి.ఎం.పాలెం. వ్యవస్థాపకుడు : 9676000633. AJV_251759

LAND FOR SALE

» అనకాపల్లి జిల్లా చోడవరం సమీపంలో 35 సెంట్ల స్థలం అమ్మకమునకు కలదు. 30"అ" తారు రోడ్డు నుండి 200 మీటరులో గ్రావెల్ రోడ్డుకి అనుకొని వుంది, ఫామ్‌హౌస్‌కి అనుకూలం. సెంటు 55వేలు, అర్జెంట్ సంప్ర : 7997894931. AJV_251762

» ఎస్.కోట నుండి అరకు హైవేరోడ్ చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ దగ్గర 2.18 ఎకరముల స్థలం (రిసార్ట్స్‌కు అనుకూలం) సంప్ర: 9542794669 9441340883. AJV_251757

PLOT FOR SALE

» 269 Sq.yds. VUDA, 50 ft. Rd. W/F, Simhapuri Colony, Nr. BRTC roads, 1/2Km. Vepagunta to Gosala. Ph : 8309494629, 9885180930. AJV_241547

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176 9966165093


జగదాంబ జంక్షన్ సమీపంలో యల్లమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల క్యూ


పుట్ట వద్ద గుమిగూడిన భక్తులు


మాధవధారలోని ఎత్తైన పుట్ట వద్ద భక్తుల సందడి

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు


ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న నాగదేవతలు

మహారాణిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో శనివారం నాగుల చవితి పండగను భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. ఆబాలగోపాలం ఉదయాన్నే పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పాలు, గుడ్లు, ఇతర పదార్థాలను, మొక్కుబడులు సమర్పించారు. గోత్రనామాలు చెప్పుకుని అందరికీ మంచి జరగాలని వేడుకున్నారు. జగదాంబ జంక్షన్‌లోని యల్లమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద పోతురాజు పుట్టలో పూజల కోసం భక్తులు బారులు తీరారు. అనేక సంవత్సరాలుగా వేలాదిమంది కుటుంబ సమేతంగా దూర ప్రాంతాల ఈ పుట్ట వద్దకు విచ్చేసి పసుపు, కుంకుమలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం కూడా పెద్దసంఖ్యలో జనం క్యూకట్టారు. జిల్లా కోర్టు, గవర్నర్ బంగ్లా, వన్‌టౌన్ తదితర ప్రాంతాలకు పెద్దసంఖ్యలో వెళ్లి పూజలు నిర్వహించారు.

మాధవధార, మురళీనగర్‌లలో..

మాధవధార: నాగుల చవితి వేడుకల్ని మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో సందడిగా నిర్వహించారు. కొండ సమీప ప్రాంతాలుగా ఉండే మాధవధార తోటల్లోకి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. పురాతన మాధవస్వామి గుడి, భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానానికి చేరే దారిలో ఎత్తైన పుట్టల వద్ద తండోపతండాలుగా పూజాదికాలు నిర్వహించారు. ఆలయాల్ని చేరే దారి భక్తుల రాకతో కిక్కిరిసింది. మురళీనగర్ సీఐఎస్ఎఫ్ క్వార్టర్ల వద్ద లోపలకు అనుమతించడంతో భక్తులు క్వార్టర్లను ఆనుకొని ఉండే కొండప్రాంతం వరకు చేరే నాగదేవతలకు కుటుంబసమేతంగా పూజలు చేపట్టారు.


ఉమానీలకంఠేశ్వరాలయంలో..

సీతమ్మధార: నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మలు ఆలయంలో నాగదేవతలకు, సుబ్రహ్మణ్య స్వామికి పాలతో అభిషేకాలు జరిపారు. కార్తీకమాస పూజల్లో భాగంగా మహాశివలింగానికి ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆవరణలో గల పుట్టలో పాలు పోసి పూజలు చేసేందుకు స్థానికంగా నివాసితులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. కృత్రిమంగా కొన్ని పుట్టలు తయారు చేసినప్పటికీ భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి వాటిలోనే పాలుపోసి, గుడ్లు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇంటిల్లిపాదీ విచ్చేశారు.

కిటకిటలాడిన వీఎంఆర్డీఏ పార్కులు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఎంఆర్డీఏ పార్కులన్నీ శనివారం సందర్శకులతో కిటకిటలాడాయి. నాగులచవితి సందర్భంగా


వీఎంఆర్డీఏ పార్కులో పిల్లలు, పెద్దల సందడి


నాగదేవతకు క్షీరాభిషేకం

విద్యాలయాలకు సెలవు ప్రకటించడం, పుట్టలో పాలు పోసేందుకు కుటుంబాలతో సహా అంతా బయటకు వచ్చే అవకాశం ఉన్నందున వారంతా సేద తీరేందుకు వీలుగా అన్ని పార్కుల్లోనూ ఉచిత ప్రవేశం కల్పించాలని ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ ఆదేశించారు. దీంతో కైలాసగిరి, బీచ్ రోడ్డులోని వీఎంఆర్డీఏ పార్కు, సిటీ సెంట్రల్ పార్కు, తెన్నేటి పార్కు... ఇలా అన్నింట్లోనూ ఉచిత ప్రవేశం కల్పించడంతో పెద్దలు, పిల్లలు అందరూ అల్పాహారాలు తెచ్చుకుని పిక్నిక్‌లా ఎంజాయ్ చేశారు.

మొక్కుల చెల్లింపు

అక్కయ్యపాలెం: నాగుల చవితి వేడుకలు వివిధ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు విచ్చేసి పుట్టలో నాగల టవల్, పాలు, గుడ్లు, నువ్వు చిమ్మిడి, తాటి గుజురు, పండ్లు వేసి భక్తిని చాటుకున్నారు. అక్కయ్యపాలెం, నాలుగు లేన్ల రహదారిలోని గ్రీన్‌బెల్ట్, దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం, కైలాసపురం తదితర ప్రాంతాల్లో


ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ప్రాంగణంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


గ్రీన్‌బెల్ట్‌లోని పుట్టలో పాలు వేస్తున్న భక్తులు

ఉన్న పుట్టల వద్దకు వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం కొందరు వెళ్లి పుట్టల్లో వేసిన గుడ్లను సేకరించుకుని తీసుకెళ్లారు.

శివరామకృష్ణ ఆలయంలో...

డాబాగార్డెన్స్: శివరామకృష్ణ ఆలయంలో ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలుపోసి నాగేంద్రస్వామిని వేడుకున్నారు. నాగుల చవితి మన సంస్కృతికి ప్రతీక కావడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు.

పంచారామాల క్షేత్రదర్శిని ప్రారంభం


జెండా ఊపి ప్రత్యేక బస్సు ప్రారంభిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రముఖ శివాలయాలను దర్శించుకోవాలనే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం పంచారామాల క్షేత్రదర్శిని పేరిట ప్రత్యేక బస్సులను నడుపుతుందని ఆర్ఎం బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పంచారామాల క్షేత్రదర్శిని మొదటి బస్సును శనివారం ఆయన ద్వారకా బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు బయలుదేరిన ఈ బస్సు ఆదివారం ఉదయానికి అమరావతికి చేరుకుంటుందని, భక్తులు అక్కడ శ్రీ అమరేశ్వరుడిని దర్శించుకున్నాక భీమవరం చేరుకుంటుందన్నారు. శ్రీభీమేశ్వరుని దర్శనానంతరం పాలకొల్లు క్షీరరామలింగేశ్వరుడిని, అక్కడ నుంచి ద్రాక్షారామం చేరుకుని భీమలింగేశ్వడిని భక్తులు దర్శించుకుంటారన్నారు. ఆ తరువాత సామర్లకోట కుమార రామలింగేశ్వరుడిని దర్శించుకున్నాక రాత్రికి విశాఖకు భక్తులు చేరుకుంటుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఈ గంగాధర్, డిపో మేనేజర్ మాధురి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

28న విలువిద్య జట్టు ఎంపిక పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా విలువిద్య (అర్చరీ) సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉమ్మడి విశాఖ జిల్లా అర్చరీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి నిషాంత్ తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ బాలురు, బాలికల విభాగాలలో ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ రౌండ్ ఈవెంట్లలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 28న ఉదయం 9 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణలోని అర్చరీ మైదానం వద్ద హాజరుకావాలన్నారు.

ప్రత్యేక రైళ్లకు బ్రహ్మపూర్ స్టేషన్‌లో హాల్ట్

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు పలు ప్రత్యేక రైళ్లకు బ్రహ్మపూర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పించామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం బరౌనిలో బయలుదేరే బరౌని-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌కు (06184), 27న బరౌని బయలుదేరే బరౌని-పొడనూర్ జంక్షన్ ఎక్స్‌ప్రెస్‌కు (06188), 28న బరౌనిలో బయలుదేరే బరౌని-పొడనూరు జంక్షన్ (06194) రైళ్లకు బ్రహ్మపూర్ స్టేషన్‌లో హాల్ట్ ఉంటుందని పేర్కొన్నారు.

రుషికొండ శ్రీవారి ఆలయంలో 10న కార్తీక దీపోత్సవం

మహారాణిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో రుషికొండలో ఉన్న శ్రీవారి ఆలయంలో నవంబరు 10న కార్తీకమాస మూడో సోమవారం దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ధర్మప్రచారమండలి, స్థానిక శ్రీవేంకట అన్నమాచార్య ట్రస్టు, ఇతర ధార్మిక సంస్థల సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులు గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసం మూడో సోమవారం రుషికొండలోని గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో భక్తులకు ఉచితంగా పూజా ద్రవ్యాలు ఇచ్చి సుమారు 5 వేల మందితో కార్తీక దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు సత్యనారాయణ, కొటారి సునీత, విజయ పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, నిర్వాహక ప్రతినిధులు

'రైల్వేల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి'


అమృత్ సంవాద్‌లో పాల్గొన్న రైల్వే అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే నిర్వహిస్తున్న అమృత్ సంవాద్‌లో భాగంగా ఆదివారం విశాఖ, దువ్వాడ, కొరాపుట్, రాయగడ స్టేషన్లలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ ఎ.ఎం.ఉబాలే హాజరై ప్రయాణికులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. రైల్వే అందిస్తున్న బాధ్యతాయుతమైన సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని రైల్వేల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో డీఎంఈ నరేంద్రకుమార్ కురి, రాయగడలో సీనియర్ డీఈఈ ఎస్ఎన్.దాస్, కొరాపుట్ రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అమృత్ సంవాద్ నిర్వహించారు.

సందడిగా ముగిసిన యువజనోత్సవాలు

జ్ఞానాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో యువజనోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. రెండో రోజు 80 కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు పాల్గొని పాశ్చాత్య, దేశీయ నృత్యాలు, మూకాభినయం, లఘు హాస్యనాటికలు, ఫోటోగ్రఫీ ప్రదర్శనతో అకట్టుకున్నారు. ముగింపు ఉత్సవాలకు వర్ధమాన నటులు అలేఖ్య, హారిక, నితీష్ కృష్ణన్ విశిష్ట అతిథులుగా విచ్చేసి విద్యార్థులతో కలసి సందడి చేశారు. ఆడి పాడారు. అందరితో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ నికితా శ్రీవల్లి విచ్చేసి విద్యార్థులతో ముచ్చటించారు. పోటీల్లో గెలుపొందినవారికి పురస్కారాలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, వీకే జయలక్ష్మి, ఎక్సెల్సియార్ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కరసుధ, కమిటీ ప్రతినిధులు సోనీ, డా.సుజాత, డా.హరిణి, డా.మాణిక్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులు, అధ్యాపకులతో వర్ధమాన నటులు

చిల్లర దొంగల చేతివాటం

అక్కయ్యపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు వెంకటరాజునగర్‌లో దొంగలు పేట్రేగిపోతున్నారు. వీరి చేతివాటం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంకటరాజునగర్‌లో పార్కింగ్ చేసిన ఆటో టైర్, స్టెపిన్‌ను విప్పి తీసుకుపోయారని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి టి.లోవకుమార్ వ్యక్తి ఆటోను పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం వచ్చి చూడగానే ఆటో టైర్‌తో పాటు స్టెపిన్ కూడా పోయినట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు ఫోన్ చేయగానే వారు వచ్చి వివరాలు సేకరించారు.


ఆటో టైరు దొంగిలించిన దృశ్యం

జోన్-5లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జ్ఞానాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం నుంచి నాలుగురోజుల పాటు తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరు, జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్-5 పరిధిలోని అన్ని సచివాలయాలు, పారిశుధ్య సిబ్బంది, ఇంజనీరింగ్, యూసీడీ, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు (ఫోన్ నెంబరు 0891-2711480) సమాచారం అందిస్తే వెంటనే అధికారులు స్పందిస్తారని అన్నారు. కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

... 5వ పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు సమీక్ష నిర్వహించారు. ఇలాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అందుబాటులోకి తేవాల్సిందేనని అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత సీసీ కెమెరాల ఏర్పాటు అంశం మరుగునపడిపోయింది. సీపీ శంఖబ్రతబాగ్చి శుక్రవారం కలెక్టర్ ఎంఎన్‌హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో భేటీ అయి ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై చర్చించారు. ఐదేళ్లపాటు నిర్వహణకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు కలెక్టర్ సూచించారు.

101 కూడళ్లలో ఏటీసీఎస్ కెమెరాలు
25 చోట్ల ఏఐ కెమెరాలు

ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు నేరాలకు అడ్డుకట్ట వేయడానికి నగరంలో 101 కూడళ్లలో అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ (ఏటీసీఎస్) కెమెరాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ కెమెరాలు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాలను గుర్తిస్తాయి. దాంతో వాహన యజమానులకు ఆటోమేటిక్‌గా ఈ-చలాన్‌ను జారీ అయిపోతాయి. హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, ట్రిపుల్ రైడింగ్, స్పీడ్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేసినా సీసీ కెమెరాలు గుర్తించి పోలీసుల ప్రమేయం లేకుండానే జరిమానా విధించేస్తాయి. అంతేకాకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రద్దీని బట్టి ఆటోమేటిక్‌గా సిగ్నల్స్ మారడం, ఒక కూడలి వద్ద గ్రీన్ లైట్ పడితే, అక్కడి నుంచి వాహనాలు తర్వాత కూడలికి వెళ్లేసరికి గ్రీన్‌సిగ్నల్ ఉండేలా సిగ్నల్ సింక్రనైజేషన్ చేస్తారు. దీనివల్ల ప్రస్తుతం ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు ఇతర విధులపై దృష్టిపెట్టేందుకు అవకాశం దొరుకుతుంది. నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో 25చోట్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరాలను ఏర్పాటుచేస్తారు. దీనివల్ల నగరంలో లేదంటే రాష్ట్రంలో ఎక్కడైనా నేరాలకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్నవారు, పాతకేసుల్లో నిందితులుగా ఉన్నవారు రోడ్డుపైకి వస్తే ఆయా కెమెరాలు వారి ముఖాన్ని గుర్తించి వారిపై ఉన్న కేసులు, వారెంట్‌లతో కూడిన సమాచారాన్ని పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు చేరవేస్తాయి. అక్కడి సిబ్బంది ఆయా సమాచారం ఆధారంగా సమీపంలోని పోలీసులను అప్రమత్తం చేసి వారిని అదుపులోకి తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రముఖులు పర్యటించే మార్గాలైన జాతీయ రహదారి, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎన్ఏడీ జంక్షన్ నుంచి పెందుర్తి వరకు బీఆర్‌టీఎస్ రోడ్లను గ్రీన్‌కారిడార్‌గా గుర్తించాలని నిర్ణయించారు.

ఐదేళ్ల నిర్వహణకు ఆర్ఎఫ్‌పీ

నగరంలో ఏర్పాటుచేసే ఏటీసీఎస్ కెమెరాలతో పాటు ఏఐ కెమెరాలను ఏర్పాటుచేయడమే కాకుండా వాటిని ఐదేళ్లపాటు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) పిలవాలని అధికారులు నిర్ణయించారు. ఆర్ఎఫ్‌పీ పిలవడంతోపాటు అర్హత కలిగిన ఏజెన్సీని ఎంపికచేయడం, ఆ ఏజెన్సీకి ఐదేళ్లపాటు ఆర్థిక వనరులను సమకూర్చే బాధ్యతను కూడా జీవీఎంసీకే అప్పగించారు. దీనికి జీవీఎంసీ కమిషనర్ కూడా సుముఖత వ్యక్తంచేయడంతో ఆర్ఎఫ్‌పీని ఎలా పిలవాలనే దానిపై అధికారులు కసరత్తు ప్రారంభించారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

- నవంబరు 16 నుంచి ప్రారంభం
- 5, 6, 7 రోజుల పేరిట ప్రత్యేక ప్యాకేజీలు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు వెళ్లాలనుకునే భక్తుల రవాణా సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ ప్రత్యేక బస్సులు నడపనున్నది. 5,6,7 రోజుల యాత్రల పేరిట ఈ బస్సులను నడపనున్నారు. నవంబరు 16 నుంచి డిసెంబరు 27 వరకు వీటిని ఆపరేట్ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టరును శనివారం ద్వారకా కాంప్లెక్సులోని ఆర్ఎం కార్యాలయంలో రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఇతర అధికారులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, పర్సనల్ ఆఫీసర్ తిరుపతి పాల్గొన్నారు.

5 రోజుల యాత్ర ప్యాకేజీ..

విశాఖ నుంచి బయలుదేరే ఈ బస్సు విజయవాడ, మేల్ మరుతుర్, ఎరుమేలి, పంబ నుంచి సన్నిదానినికి చేరుకుంటుంటి. అక్కడ స్వామివారి దర్శనానంతరం శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, విజయవాడ మీదుగా విశాఖ చేరుకుంటుంది. ఇందుకు గాను ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ.6,600, ఇంద్ర ఏసీ బస్సుకు రూ.8,500గా ఆర్టీసీ నిర్ణయించింది.

6 రోజుల యాత్రకు..

విశాఖ నుంచి బయలుదేరే ఈ బస్సు విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవానీ, పళని, ఎరుమేని, పంబ నుంచి స్వామివారి సన్నిదానానికి చేరుకుంటుంది. అక్కడ అయ్యప్ప దర్శనమయ్యాక తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం సత్యనారాయణస్వామిని భక్తులు దర్శించుకున్న తరువాత విశాఖకు చేరుకుంటుంది. ఇందుకోసం ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ.7,000, ఇంద్ర ఏసీ బస్సుకు రూ.9,000ను వసూలు చేస్తారు.

7 రోజుల యాత్రకు..

విశాఖ నుంచి బయలుదేరే బస్సు విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవానీ, పళని, ఎరుమేని, పంబలను దర్శించుకున్నాక సన్నిదానానికి చేరుకుంటుంది. అక్కడ అయ్యప్ప స్వామి దర్శనమయ్యాక మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నాక విశాఖ చేరుకుంటుంది. ఇందుకోసం ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ.7,600, ఇంద్ర ఏసీ బస్సుకు రూ.10,000 చొప్పున వసూలు చేయడం జరుగుతుంది. ఆర్టీసీ ఆన్‌లైన్‌లో టిక్కెట్లను రిజర్వ్ చేసుకునే అవకాశం ఉంది. మరిన్ని వివరాలకు 7382914219 సెల్ నంబర్‌ను సంప్రదించవలసిందిగా ఆర్ఎం కోరారు.

నేడు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్

... 5వ పేజీ తరువాయి

చేరింది. ఇక న్యూజిలాండ్ ఇప్పటివరకూ ఆరు మ్యాచ్‌లు ఆడి నాలుగు పాయింట్లు (ఒక గెలుపు, మూడు ఓటమి, ఫలితం తేలనివి రెండు) సాధించింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, భారత్‌లు ఇప్పటికే సెమీఫైనల్స్‌కు చేరాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఇక్కడ ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న చివరి లీగ్ మ్యాచ్ నామమాత్రమే. ఇదిలావుంటే మ్యాచ్‌పై తుఫాన్ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి.

ఇకపై డీడీవోలు...

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షించేందుకు డీఎల్‌డీవో పోస్టులు కొత్తగా ఏర్పాటుచేశారు. ఎంపీడీవోలలో సీనియర్లను తాత్కాలికంగా డీఎల్‌డీవోలుగా నియమించారు. వీరి కోసం ప్రత్యేకించి భవనాలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీరాజ్ శాఖను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి ఎంపీడీవోలకు పదోన్నతులు ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమించారు. అయితే పదోన్నతులు ఇవ్వడంతో సరిపెట్టకుండా వారికి మరిన్ని అధికారాలు, బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. డీఎల్‌డీవో పోస్టును డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో)గా మార్చారు. పంచాయతీరాజ్‌లో గ్రామ పంచాయతీలను పర్యవేక్షించే డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారులు, గ్రామీణాభివృద్ధిలో ప్రధానంగా ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలించే డ్వామా ఏపీడీలు డీడీవోల పరిధిలోకి తీసుకువచ్చారు. ఇంకా మండల పరిషత్ అధికారులు (ఎంపీడీవోలు) కూడా డీడీవో పర్యవేక్షణలో పనిచేయాలని ప్రభుత్వం జాబ్ చార్ట్ రూపొందించింది. డివిజన్ పరిధిలో సచివాలయాలు మొత్తం డీడీవో పర్యవేక్షణలో పనిచేస్తాయి. సచివాలయాల సిబ్బంది సర్వీస్ వ్యవహారాలు కూడా డీడీవోనే చూస్తారు. పంచాయతీరాజ్ శాఖలో ఇంజనీరింగ్ పనులపై డీడీవోకు సమీక్షించే అధికారం ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖపట్నం, భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు కేంద్రంగా డీడీవో కార్యాలయాలు నవంబరు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ప్రస్తుతం ఉన్న డీఎల్‌డీవో కార్యాలయాలనే డీడీవో కార్యాలయాలుగా మార్పు చేశామన్నారు. కమిషనర్ ఆదేశాలతో కార్యాలయాల ఆధునికీకరణ, ఫర్నిచర్, పెయింటింగ్ పనుల నిమిత్తం ఒక్కొక్క కార్యాలయానికి రూ.15 లక్షలు వెచ్చించామన్నారు.

రవాణా శాఖ కొరడా

... 5వ పేజీ తరువాయి

దగ్ధమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేటు ట్రావెల్స్‌లో భద్రత, ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలు మేరకు బస్సులను తిప్పుతున్నారా?, లేదా?..అనేది తనిఖీ చేయాలని రవాణా శాఖ అధికారులను ఆశాఖ కమిషనర్ మనీష్‌కుమార్‌సిన్హా ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ తనిఖీ ప్రారంభించారు. తాజాగా కర్నూలు జిల్లాలో కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురవ్వడంతో మరింత ముమ్మరం చేశారు. గత 11 రోజుల్లో జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 56 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదుచేసి రూ.పది లక్షలు జరిమానా విధించారు. ఇవికాకుండా శుక్రవారం ఆరు, శనివారం 16 బస్సులపై కేసులు నమోదుచేశారు. శుక్రవారం కేసులు నమోదుచేసిన ఆరు బస్సుల్లో రెండింటికి పర్మిట్‌లు లేకపోవడంతో సీజ్ చేశారు. శనివారం మరో ఆరు బస్సులను సీజ్ చేశారు. శనివారం సీజ్‌చేసిన వాటిలో వర్షిణి, కావేరి, ఏఆర్ ట్రావెల్స్, శ్రీకృష్ణ ట్రావెల్స్, కేఆర్‌టీ ట్రావెల్స్‌కు చెందిన బస్సులు ఉన్నాయి. వీటిల్లో సీట్లను మార్చడం, అత్యవసర ద్వారం మూసేసి అక్కడ అదనంగా సీట్లను ఏర్పాటుచేయడం, పర్మిట్లు లేకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్టు డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు వివరించారు.

అప్పన్న భూములకు రెక్కలు

... 5వ పేజీ తరువాయి

అవసరమని గత నెలలో వెనక్కి తీసుకుంది. అక్కడ చదరపు గజం రేటు రూ.44 వేలుగా ఉందని, వాటి విలువ రూ.2,267.38 కోట్లుగా చూపించింది. అడవివరంలో 150 ఎకరాలు, మధురవాడలో 106.47 ఎకరాలు మొత్తం 256.47 ఎకరాలు కాగా వాటి విలువ రూ.3,501.58 కోట్లుగా వెల్లడించింది.

ప్రత్యామ్నాయంగా మళ్లీ ఆ కొండల్లోనే

పంచగ్రామాల భూ సమస్య పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి తీవ్రంగా కృషిచేస్తున్న సంగతి తెలిసిందే. 2008 సర్వే లెక్కల ప్రకారం 12,149 మంది ఆక్రమించిన దేవస్థానం భూమి విస్తీర్ణం 420 ఎకరాలు. దానికి ప్రత్యామ్నాయంగా 547 ఎకరాలు ఇవ్వడానికి ప్రతిపాదిస్తే దానిని దేవస్థానం ఛైర్మన్ అశోక్‌గజపతిరాజు తొలుత వ్యతిరేకించారు. ఆ తరువాత గాజువాక, మల్కాపురం, గొల్లలపాలెం, పెదగంట్యాడల్లో మొత్తం 610.89 ఎకరాల కొండలను ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. వాటి విలువ రూ.5,231 కోట్లుగా న్యాయస్థానానికి తెలిపింది. అక్కడ ఆమోదం లభిస్తే వాటిని బదలాయిస్తారు. ఏఇప్పుడు తాజాగా ఐటీ కంపెనీల కోసం తీసుకున్న 256.47 ఎకరాలకు ప్రత్యామ్నాయంగా మళ్లీ అదే కొండల్లో అదే ప్రాంతాల్లో అంటే గాజువాక, ములగాడ మండలాల్లోని మల్కాపురం, గొల్లలపాలెం, ములగాడల్లోని అవే సర్వే నంబర్లలో 370.9 ఎకరాలు ఇవ్వడానికి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రతిపాదించారు. గాజువాకలో గజం రూ.32 వేలు, గొల్లలపాలెంలో రూ.22 వేలు, మల్కాపురంలో రూ.17 వేలు చొప్పున మార్కెట్ ధర నిర్ణయించారు. ఈ లెక్కన ప్రత్యామ్నాయంగా ఇచ్చే భూమి విలువ రూ.4,089.19 కోట్లు అని పేర్కొన్నారు. అంటే పాతవి, కొత్తవి కలిపి రూ.9,320 కోట్ల విలువైన భూములు దేవస్థానానికి ఇవ్వడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అయితే అవన్నీ కొండలని, పైగా పారిశ్రామిక ప్రాంతానికి దగ్గరగా ఉన్నాయని, నివాసాలకు ఉపయోగపడవని దేవస్థానం అధికారులు పెదవి విరుస్తున్నారు. కొన్నాళ్ల తరువాత ఆ భూములను కూడా వెనక్కి తీసుకున్నా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.




జగదాంబ జంక్షన్‌లోని ఎల్లమ్మతోట ఆలయంలో గల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, ఆలయం వద్ద క్యూలో బారులుతీరిన భక్తులు




ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులో గల పుట్ట వద్ద భక్తుల పూజలు... పక్కన జనసంద్రంగా మారిన రహదారి



జూ పార్కులో పూజల అనంతరం సేదతీరుతున్న జనం

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

- జనంతో కిటకిటలాడిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ రోడ్డు
- మద్దిలపాలెం కూడలిలో స్తంభించిన ట్రాఫిక్
- ఎల్లమ్మతోట ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను శనివారం నగరవాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా పుట్టకు వెళ్లి నాగేంద్రుడిని పూజించారు. నగరంలోని పోర్టు క్వార్టర్స్, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి రైల్వే క్వార్టర్స్ కైలాసపురం, సీతమ్మధార, ఆరిలోవ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఎల్లమ్మ తోట ఆలయం, జూ, కైలాసగిరి, ఎన్ఏడీ, పెందుర్తి, గాజువాక, గోపాలపట్నం, తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పూజలు చేశారు. పుట్టలో పాలు, గుడ్లు, తదితర ప్రసాదాలను వేశారు. పుట్టమన్నును కొద్దిగా తీసి చెవులకు అద్దుకున్నారు. అలా చేయడం వల్ల చెవిపోటు రాదన్నది భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం పుట్టల సమీపంలో పలువురు భక్తులు బాణసంచా కాల్చారు. కాగా జగదాంబ జంక్షన్‌కు సమీపంలోని ఎల్లమ్మతోటలో గల పుట్టలో పాలు పోసేందుకు భక్తులు బారులుతీరారు. అదేవిధంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులో గల పుట్టల వద్ద పూజలు జరిపేందుకు వచ్చిన భక్తులతో ఈ ప్రాంతం కిటకిటలాడింది. ఈ క్రమంలో మద్దిలపాలెం కూడలిలో చాలాసేపు ట్రాఫిక్ స్తంభించింది.



నాగులచవితి పూజలకు వచ్చిన భక్తులతో కళకళలాడుతున్న కైలాసగిరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అగనంపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధిలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, ఇండోర్ సబ్‌స్టేషన్ లైన్ల నిర్వహణ జంగిల్ క్లియరెన్స్ పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్ .రామకృష్ణ తెలిపారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 34, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 66, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు(కిలో) 78, అల్లం(పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు66, దోసకాయలు 28, వెల్లుల్లి(పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడుచిక్కుడు 76, గోరుచిక్కుడు 42 , కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, క్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (SUDA), శ్రీకాకుళం
Ref No.IFB No.10/2025-26, dt:24.10.2025
SUDA వారు చేపడుతున్న పనులకు "తృతీయ పక్ష నాణ్యత నియంత్రణ (TQPC) సేవలు" అందించుటకు అర్హత కలిగిన ఏజెన్సీలు/ కన్సల్టెంట్ల నుండి "ప్రతిపాదనలు (RFPs)" ఆహ్వానించబడుతున్నాయి. RFP పత్రాలు SUDA వెబ్‌సైట్ www.eprocurement.gov.in నుండి పొందవచ్చు. చివరితేదీ: 13.11.2025 Upto 5.00PM వివరాలకు వైస్ చైర్మన్, SUDA శ్రీకాకుళం
సం/- వైస్ చైర్మన్, SUDA

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే గణబాబు

అంతర్ జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

గోపాలపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతో కృషి చేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇక్కడి జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలోని ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 69వ అంతర్ జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికల విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో సుమారు 500 మంది పాల్గొన్నారు. డీడీఈవో సోమేశ్వరరావు, ఫెడరేషన్ సభ్యుడు డీవీఎస్‌వై శర్మ, తదితరులు పాల్గొన్నారు.



బాలికతో కలిసి సరదాగా టేబుల్ టెన్నిస్ ఆడుతున్న గణబాబు

మేహాద్రిగెడ్డలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గోపాలపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. స్పిల్‌వే వద్ద ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో రిజర్వాయర్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడి సుమారు 40 ఏళ్లు ఉంటాయని, చేతికి ఎరుపురంగు తాడు, గ్రే కలర్ ప్యాంట్‌తో ఉన్నాడని పోలీసులు తెలిపారు. సీఐ సతీశ్ కుమార్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కేజీహెచ్‌లోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 9676797314 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సీఐ కోరారు. కాగా మృతదేహాన్ని పరిశీలిస్తే ఎవరో హత్య చేసి ఉంటారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. శరీరం కాలినట్టుగా బొబ్బలు ఉండడం, షర్టు లేకపోవడం, ముఖం గుర్తుపట్టని విధంగా మారడాన్ని బట్టి చూస్తే హత్య చేసి ఇక్కడ పడేశారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

శారదా నదిలో స్నానానికి దిగి ఒకరి మృతి



రామచంద్రరావు

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి సోమలింగపాలెం సమీపంలో శారదా నదిలో శనివారం స్నానానికని దిగి ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గాజువాకలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన తోటిపూడి రామచంద్రరావు(34) అక్కడ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. నాగుల చవితి సందర్భం గా భార్య, పిల్లలతో శుక్రవారం సోమలింగపాలెంలోని అత్తవారింటికి వచ్చాడు. శనివారం ఉదయం స్థానికులతో కలిసి స్నానానికి శారదా నదికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తూ మునిగి మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానికులు బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు బస్సుల్లో తనిఖీలు

అగనంపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి టోల్‌గేటు వద్ద శుక్రవారం రాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో రవాణ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నగరం నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వెళుతున్న పలు ట్రావెల్స్ బస్సులను ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పర్మిట్ లెని బస్సులను సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ గోవిందరావు తెలిపారు. అలాగే మరో 9 బస్సుల్లో వివిధ లోపాలు గుర్తించి రూ.2.6 లక్షల జరిమానాలు విధించామని తెలిపారు. బస్సుల్లో అత్యవసర ద్వారాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించామని తెలిపారు. ట్రావెల్ బస్సులు భద్రతా నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు.

వాడవాడలా నాగుల చవితి

గాజువాక / ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పండుగను పారిశ్రామిక ప్రాంతంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్లాంట్ టౌన్‌షిప్ మార్గం, నగరానికి కొద్ది దూరంగా ఉన్న ప్రాంతాల్లో పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. ఎంతో భక్తిశ్రద్ధలతో చవితి ఉత్సవాలు నిర్వహించారు.

అగనంపూడి, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85వ వార్డులు అగనంపూడి, గల్లవానిపాలెం, శనివాడ, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఇ-మర్రిపాలెం, గొన్నవానిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంత గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో శనివారం నాగుల చవితిని పూజలు చేశారు. ఈ సందర్భంగా వేకువజామునే భక్తులు కుటుంబ సభ్యులతో పుట్టల వద్దకు చేరుకుని పాలు పోసి ప్రత్యే పూజలు చేశారు.

పెదగంట్యాడ, (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ప్రాంతంలో నాగుల చవితి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. హైందవ సంప్రదాయ ప్రకారం ప్రజలు పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతను పూజించారు. ఈ సందర్భంగా పాలు, గుడ్లు, చలిమిడి, చిమ్మిడి వంటికి ప్రసాదంగా పెట్టి పూజలు చేశారు.

ఆటోనగర్, (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో ప్రజలు కుటుంబ సమేతంగా నాగుల చవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 70వ వార్డు ఆటోనగర్, చట్టివానిపాలెం, తోకాడ, కుంచుబమాంబ కాలనీ, 87వ వార్డు వడ్లపూడి, కణితి, 88వ వార్డులో వెదుళ్ల నరవ, దువ్వాడ, సంధ్యానగర్ ప్రాంతాల్లో సహజంగా ఏర్పడిన పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి): నాగులచవితి సందర్భంగా భెల్, హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌తో పాటు జాతీయ రహదారి పక్కనున్న పుట్టలు భక్తుల రాకతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది, తుంగ్లాం పరిసర ప్రాంతాల ప్రజలు భెల్, హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లో ఉన్న పుట్టల వద్ద పూజలు చేశారు.

పెందుర్తి(ఆంధ్రజ్యోతి): నాగులచవితిని పురస్కరించుకుని చినముషిడివాడలో గల కిశోర్ లేఅవుట్ సమీపంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, లక్ష్మి దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. నాయకులు పంచకర్ల వెంకటేశ్వరరావు, సేనాపతి శంకరరావు, ముదునూరి రాజాసుధాకర్, కరణం దేవుడు, కనకారావు, గొర్లె అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



పుట్టలో పాలు పోస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

మల్కాపురం(ఆంధ్రజ్యోతి): ఇక్కడి మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఉన్న పోర్టు స్థలంలో సహజసిద్ధమైన పుట్ట వద్దకు భక్తులు తరలివచ్చి నాగేంద్రుడికి పూజలు జరిపి, బాణసంచా కాల్చారు. పుట్టలు అందుబాటులో లేనివారు కృత్రిమ పుట్టలు తయారు చేసుకుని పూజలు చేశారు. చాలామంది సమీపంలోని కొండలపైకి వెళ్లి పుట్టల వద్ద పూజలు జరిపారు.

పెందుర్తి-రూరల్/వేపగుంట,(ఆంధ్రజ్యోతి): పెందుర్తి, వేపగుంట, సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పూజాది కార్యక్రమాల తరువాత పలువురు బాణసంచా కాల్చారు.

గోపాలపట్నం(ఆంధ్రజ్యోతి): ఇక్కడి కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, వెంకటాపురం, పాత గోపాలపట్నం, పద్మనాభనగర్, కంపరపాలెం, ఇందిరానగర్, లక్ష్మీనగర్, తదితర ప్రాంతాల్లో గల పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. నాగేంద్రకాలనీలోని నాగేంద్రుడి ఆలయం వద్ద గల పుట్టలో పాలు పోసేందుకు భక్తులు పోటెత్తారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

పెందుర్తి-రూరల్/వేపగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చీమలాపల్లి, చింతలఅగ్రహారం ప్రాంతాల్లో శనివారం శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. చింతలఅగ్రహారం, గవరపాలెం, దుర్గానగర్, లక్ష్మీపురం, చీమలాపల్లి గ్రామాలకు చెందిన యువతీ, యువకులు చినముషిడివాడలో శిల్పి ఇంటి వద్దకు తరలివెళ్లారు. గౌరీపరమేశ్వరుల ఉత్సవ ప్రతిమలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆయా గ్రామాలకు తీసుకువెళ్లి మండపాల్లో ప్రతిష్ఠించారు. 15 రోజులను పాటు ఉత్సవాలను నిర్వహిస్తామని కమిటీల ప్రతినిధులు తెలిపారు.



ఉత్సవ మూర్తులు

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు సంపూర్ణం

అగనంపూడి, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అట్టవానిపాలెంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. సాయంత్రం గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశీలు వసూళ్ల రగడ

మల్కాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలో శనివారం రాత్రి ఆశీలు వసూలుదారుడికి, వ్యాపారులకు మధ్య గొడవ జరిగింది. సాధారణంగా ఆశీలు కింద రూ.10 వసూలు చేయాల్సి ఉండగా, నాగుల చవతి కాబట్టి రూ100 ఇవ్వాలని ఆశీలు వసూలుదారుడు డిమాండ్ చేయడంతో వ్యాపారులంతా తిరగబడ్డారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో కాసేపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పలువురు వ్యాపారులు తామెందుకు అధిక మొత్తం చెల్లించాలని గట్టిగా నిలదీయడంతో ఆశీలు వసూలుదారుడు అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళతామని వ్యాపారులు తెలి పారు.

నేడు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి రాక

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ మూడు రోజుల పర్యటనకు గాను ఆదివారం నగరానికి వస్తున్నారు. ఆదివారం రాత్రి నగరానికి చేరుకుని హోటల్ గ్రాండ్‌బేలో బస చేస్తారు. ఈ నెల 27వ తేదీ ఉదయం ఏఎంసీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. విమ్స్‌లో డ్రగ్ కంట్రోల్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం బీజేపీ కార్యాలయానికి వెళతారు. 28న ఆయన విజయవాడ వెళతారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

మల్కాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రిలో సఖి సురక్ష (మహిళల ఆరోగ్యానికి సురక్ష కవచం) కార్యక్రమాన్ని మెప్మా ఆధ్వర్యంలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ సహకారంతో ఈ-వైద్య ప్రైవేటు లిమిటెడ్ భాగస్వామ్యంతో శనివారం నిర్వహించారు. అనేక మంది మహిళలు ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల శారీరక, మానసిక, పోషకాహార, ఆరోగ్యాన్ని కాపాడి, వారి ఆర్థిక సుస్థిరత సాధించడమే సఖి సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఏపీడీవో కృపానంద్‌తో పాటు పలువురు వైద్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు

'కార్మికుల సంక్షేమమే ధ్యేయం'

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానలపై నిరంతరం పోరాటాలు చేస్తూ విజయం సాధిస్తున్న ఘనత సీఐటీయూకు మాత్రమే ఉన్నదని జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లో శనివారం జరిగిన సీఐటీయూ 14వ మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భెల్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతూ భెల్ హెచ్‌పీవీపీలో ఆర్ సీరిస్ కార్మికుల డేట్ ఆఫ్ జాయినింగ్ సమస్యతో పటు హయ్యర్ పెన్షన్ విధానం, యువ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ పూర్తిగా కృషి చేస్తోందని అన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SHRIRAM Finance)
ఆఫీస్ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, డి.నెం.14-1-1/2బి, 2వ ఫ్లోర్, మోర్ ఎదురుగా, మహారాణిపేట, విశాఖపట్నం - 530002

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్)** (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" అని పిలువబడేది, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనం చేయబడినది మరియు తేది.09.11.2022 నాటి NCLT Bench-II చెన్నై ఆదేశాల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తరువాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్చడానికి ఆమోదం పొందినది (కార్పొరేట్ ఆర్థిక మంత్రిత్వ శాఖ తేది.30.11.2022 నాటి లేఖ ప్రకారం) కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టర్ చేయబడిన కంపెనీ మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపారం చేయడానికి ఆర్‌బిఐలో కూడా రిజిష్టర్ చేయబడినది, దాని రిజిష్టర్డ్ కార్యాలయం శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032 వద్ద ఉంది) యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా దిగువ పట్టికలోని వివరాలుగల ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.


ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని **తేది.23.10.2025**న స్వాధీన పరచుకున్నారు.


ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి
1. మొల్లి కనక సంతోష్ కుమార్, తండ్రి : ఎమ్. సూర్యనారాయణ, ఇ.నెం.13-16-36/2, సంజీవ గిరి కాలనీ, బిసి రోడ్డు, గాజువాక, విశాఖపట్నం - 530026. **2. దొక్కుల రామ సీత,** భర్త : డి. శ్రీనివాసరావు, తండ్రి : ఎమ్. పోలిరాజు, ఇ.నెం. 4-133/1, కాపు వీధి-1, పెద్దబొడ్డేపల్లి, నర్సీపట్నం, విశాఖపట్నం - 531116. **3. మొల్లి వరాహ రామ్ కుమార్,** తండ్రి : సూర్యనారాయణ, ఇ.నెం. 13-16-36, సంజీవ గిరి కాలనీ, బిసి రోడ్డు, గాజువాక, విశాఖపట్నం - 530026.	ఋణ ఖాతా నెం. GJWKATF2209300003 యొక్క రిఫరెన్సు క్రింద రూ.43,43,723/- (అక్షరాల నలభై మూడు లక్షల నలభై మూడు వేల ఏడు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) చెల్లించవలసి యున్నది **డిమాండ్ నోటీసు తేది : 09-06-2025**

నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ నెం.7468/2022 ప్రకారం దొక్కుల రామ సీత గారి స్థిర తనఖా ఆస్తి వివరములు: అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం సబ్ డిస్ట్రిక్ట్, నర్సీపట్నం మండలం, నర్సీపట్నం మున్సిపాలిటీ ఏరియా, పెద్దబొడ్డేపల్లి గ్రామ ఖాతాలో, సర్వే నెం. 45/1, 8వ వార్డు, 8వ బ్లాకు, శ్రీనగర్ కాలనీ నుండి చోడవరం పోవు రోడ్డుకు పడమర వైపున 108 చ॥గ॥లు లేదా 90.28 చ॥మీ॥ల విస్తీర్ణంలో క్రింది అంతస్తు నందు 550 చ॥అ॥ల ఫ్లింత్ ఏరియా, మొదటి అంతస్తు నందు 550 చ॥అ॥ల ఫ్లింత్ ఏరియా మరియు బాత్ రూమ్స్ నందు 55 చ॥అ॥ల ఫ్లింత్ ఏరియాతో, డి.నెం.8-8-489తో గల ఆర్‌సిసి భవనం యావత్తు ఆస్తి. **కొలతలు మరియు హద్దులు: తూర్పు** : తుమ్మిడి అనంత లక్ష్మి సత్యవతి గారి స్థలం - 35.60 అ॥లు లేదా 10.85 మీ॥లు, **దక్షిణం** : పెట్ల సింహాచలం గారి స్థలం - 25.00 అ॥లు లేదా 7.625 మీ॥లు, **పడమర** : తుమ్మిడి అనంత లక్ష్మి సత్యవతి గారి ఇల్లు - 40.60 అ॥లు లేదా 12.38 మీ॥లు, **ఉత్తరం** : రోడ్డు - 26.00 అ॥లు లేదా 7.93 మీ॥లు.,

సాధారణ ప్రజానీకమంతటికి కూడా ఈ నోటీసు ద్వారా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై **ఎస్ఎఫ్ఎల్** యొక్క అధీకృత అధికారి చట్టపరమైన స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీసు అందిన తర్వాత ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి **ఎస్ఎఫ్ఎల్** యొక్క ముందస్తు లిఖితపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగా బదిలీ చేయరాదు లావాదేవి జరుపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : విశాఖపట్నం, తేది : 23-10-2025 | అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్







CLASSIFIEDS

FLAT FOR SALE

★ **2B/R, 1150Sft, 90Sft,** Car Parking , 4th Floor, E/F, Sri Sai Srinivasa Sadan, TPT Colony, S.dhara, Vizag. 5Yrs Old., No Agents. Ph: **73864 59064.** AJV_251761

★ **3BHK, 6yrs old E/F 1350sft** with complete wood work, grills 100ft road, 2bhk, 1060sft with Modular Kitchen, Grills, 2y Old, Sujathanagar. **Ph: 7997274447, 8639168165.** AJV_251765

★ **Dwarakanagar - 2 BHK** Premium Flats, N Facing, No GST, Ready to occupy, Near B.V.K. College, Dwarakanagar, VSP. **Ph: 9542794669, 9492458777.** AJV_251758

» **2BHK 1000sft** & 3BHK 1260sft, Near Police Station to Pendurthi Centre, Zudio, Style Union Backside, Brundavan Garden, VSKP.. Ph : **8886216096, 9393108858** AJV_14535

» **3 BHK flat 1420 sqft + 120 sqft two** car parkings, full wood work modular kitchen safety grills etc for URGENT sale just behind SHEELA NAGAR Call : **8125588588.** AJV_251766

★ **East Facing 1000sft** 2BHK Near By Park, Tempany School, Main Road, Side Flats, VUDA Colony, Ready to Occupy. Gajuwaka. **Ph: 9603626627.** AJV_251763

» **Sivajipalem Premium** Flat Sale, 2BHK, 920Sft, North Facing. Opposite Sivaji Park Road. Contact: **9866122731, 9000922731.** AJV_7938

WANTED

» విజయవాడ, మొగలరాజపురం నందు ఇంటి దగ్గర ఉండి Supervisor గా పనిచేయుటకు మాస్టర్ డిగ్రీ చదువుకుని మరియు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలు తెలిసి వున్న ఆడ మనిషి కావలెను మరియు ఆసక్తికరమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: **63093 60969, 83417 15255.** AJB-235779

OLD AGE HOME

» శ్రీవైష్ణవి రిటైర్మెంట్ హోమ్స్ హాస్పటల్, ఓల్డ్ ఏజ్ హోమ్స్, హోమ్ నర్సింగ్ సర్వీసెస్, బెడ్ రిడెన్, ఫిజియోథెరపి, A/C, Non A/C రూమ్స్ @ MVP / సీతమ్మధార, / విశాలాక్షినగర్ / పి.ఎం.పాలెం. సంప్రదించండి : **9676000633.** AJV_251759

LAND FOR SALE

» అనకాపల్లి జిల్లా చోడవరం సమీపంలో 35 సెంట్ల స్థలం అమ్మకమునకు కలదు. 30'ల తారు రోడ్డు నుండి 200 మీటరులో గ్రావెల్ రోడ్డుకి ఆనుకొని వుంది, ఫామ్‌హౌస్‌కి అనుకూలం. సెంటు 55వేలు, అర్జెంట్. సంప్ర : **7997894931.** AJV_251762

» ఎస్.కోట నుండి అరకు హైవేరోడ్ చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ దగ్గర 2.18 ఎకరముల స్థలం (రిసార్ట్స్‌కు అనుకూలం) సంప్ర: **9542794669 9441340883.** AJV_251757

PLOT FOR SALE

» **269 Sq.yds. VUDA, 50 ft. Rd.** W/F, Simhapuri Colony, Nr. BRTC roads, 1/2Km. Vepagunta to Gosala. Ph : **8309494629, 9885180930.** AJV_ 241547

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093